


సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 208 పేజీలు : 12, వెల రూ. 5/- ఆదివారం, సెప్టెంబరు 20, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

# సుప్రీంకోర్టుకు 'దానం'



ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు.

**తన అనర్హతను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరపున పోటీ చేయడమే కారణం**

**ఇప్పటికే సుప్రీంలో కేవియట్ దాఖలు చేసిన ఇతర ఎమ్మెల్యేలు**

బీఆర్ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా

2లో

## అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్!

**వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ తప్పనిసరి..**

- వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ తప్పనిసరి
- 2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుంది
- బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి మార్కెట్ ధరకే సిలిండర్ సరఫరా
- అక్రమాలను అరికట్టేందుకే ఈ నిర్ణయమన్న కేంద్ర ప్రభుత్వం

2లో

## అండమాన్‌లో అల్పపీడనం..

- మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం
- ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం

# విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం'..

- లబ్ధిదారులకు ఆస్తి హక్కు పత్రాలు అందించిన సీఎం చంద్రబాబు
- విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం
- 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ
- పేదల ఇళ్ల కోసం 399 ఎకరాల భూమి క్రమబద్ధీకరణ
- పట్టాలు అందించి ర్యాంప్ వాక్‌తో అలరించిన సీఎం చంద్రబాబు
- పంపిణీ చేసిన ఆస్తుల విలువ రూ.8,874 కోట్లు



# జన్వాడ ఫాంహౌస్ ను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీలు

**జన్వాడ ఫాంహౌస్.. నాలాపై కట్టిన అక్రమ నిర్మాణమే: కాంగ్రెస్ ఎంపీలు**

**ఈ ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవన్న ఎంపీ చామల**

**అసలు యజమాని ఎవరనే దానిపై అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్య**



రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని వివాదాస్పద ఫాంహౌస్‌ను (కేటీఆర్ ఫాంహౌస్ గా ఆరోపణలు) కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం ఈరోజు నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగి కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిశీలన అనంతరం మాట్లాడిన నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి... జన్వాడ ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, మురుగునీటి కాలువ (నాలా) పైనే ఈ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని సంచలన ఆరోపణలు చేశారు. ఇంత పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన (మిగతా 2వ పేజీలో)

# 180 ఎకరాలు మావేనంటున్న రైతులు!

- ఎర్రవల్లి 325 సర్వే నంబర్‌పై కొనసాగుతున్న పరిశీలన
- మొత్తం 388 ఎకరాల భూములపై అధికారుల సర్వే
- 180 ఎకరాలు తమవేనంటున్న వెంకటాపూర్ రైతులు
- పాత ఖాస్రా, సేత్వార్ రికార్డులు పరిశీలించాలని డిమాండ్
- ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజ్‌పూర్ హద్దుల పరిశీలన



# మరోసారి యూరప్ పర్యటనకు జగన్..



**షరతులతో సీబీఐ కోర్టు అనుమతి**

**కుటుంబంతో కలిసిన యూరప్ పర్యటనకు వెళ్లనున్న జగన్**

**15 రోజుల పర్యటనకు సమ్మతి తెలిపిన నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టు**

**ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ వివరాలను ఇవ్వాలని కోర్టు ఆదేశం**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆయన విదేశీ పర్యటనకు హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. కుటుంబ సమేతంగా యూరప్‌లోని తన కుమార్తెల వద్దకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, 15 రోజుల పర్యటనకు సమ్మతి తెలిపింది.






# అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్!

ఇప్పటికే 90 శాతం మంది వినియోగదారులు బయోమెట్రిక్ పూర్తి చేశారుదేశీయ వంటగ్యాస్ (ఎల్పీజీ) వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ ధరపై వంటగ్యాస్ సిలిండర్లను పొందేందుకు 2026 అక్టోబర్ 1 నాటికి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ (బీఏఏ) ప్రక్రియను పూర్తి చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.అర్హులైన కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడటంతో పాటు, గృహ అవసరాల సిలిండర్లు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు అక్రమంగా మళ్లకుండా నిరోధించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది. ఆధార్‌తో బయోమెట్రిక్ అనుసంధానం చేయడం ద్వారా డూప్లికేట్, అనర్హమైన కనెక్షన్లను సులభంగా గుర్తించి తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొంది.వినియోగదారులు వివిధ మార్గాల్లో ఈ బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేసే సౌలభ్యం ఉంది. సిలిండర్ డెలివరీ చేసే సమయంలో సిబ్బంది వద్ద ఉండే మొబైల్ యాప్ ద్వారా, లేదా నేరుగా సమీపంలోని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వీటితో పాటు సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల అధికారిక మొబైల్ యాప్‌ల (ఇండేన్‌కు ఇండియన్‌ఆయిల్ వన్, భారత్‌గ్యాస్‌కు హలోబీపీసీఎల్, హెచ్‌పీ గ్యాస్‌కు హెచ్‌పీ పే) ద్వారా కూడా వినియోగదారులు స్వయంగా ప్రామాణీకరణ చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది.ఇప్పటికే బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో సబ్సిడీ వర్తించదు. అటువంటి వారు సిలిండర్‌ను మార్కెట్ ధరకే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 19 నాటికి దేశవ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది, అంటే 27.43 కోట్ల మంది వినియోగదారులు ఇప్పటికే బయోమెట్రిక్ ప్రామాణీకరణను పూర్తి చేశారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.ప్రస్తుతం 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్‌పై సుమారు రూ. 210 వరకు రాయితీ లభిస్తోంది. కేవలం అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఈ ప్రయోజనం చేకూరేలా చూడటం ప్రభుత్వ ఆర్థిక సుస్థిరతకు అత్యవసరమని కేంద్ర ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది.

# అండమాన్‌లో అల్పపీడనం..

ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# జన్వాడ ఫాంహౌస్‌ను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీలు

ఈ ఫాంహౌస్ భూముల వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు దాగి ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్ రెడ్డి పేరుతో ఈ భూములు ఉన్నప్పటికీ, అసలు యజమానులెవరనే దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫాంహౌస్ నిర్మించారని, శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఉన్న ఈ స్థలాల్లో కేటీఆర్ అర్ధాంగి శైలిమతో పాటు ఆయన అత్తగారి పేరిట కూడా భూములు ఉన్నాయని ఆరోపించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న హయాంలో తన అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించారని, గతంలో ఈ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ కెమెరా ఎగురవేసినందుకు రేవంత్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

# సుప్రీంకోర్టుకు ‘దానం’

పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

# విశాఖలో ‘పేదలకు పట్టాభిషేకం’..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో ‘పేదలకు పట్టాభిషేకం’ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల పట్టాలను (ఆస్తి హక్కు పత్రాలు) ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని 28,445 కుటుంబాలకు వారి సొంతింటి కల సాకారమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్ల స్థలాల కోసం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. ఈ క్రమబద్ధీకరించిన స్థలాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పంపిణీ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.8,874 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమం నగరంలో పండగ వాతావరణాన్ని తలపించింది. అంతకుముందు, ఇవాళ విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం చంద్రబాబు లబ్ధిదారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ఆయన లబ్ధిదారులను, సభకు హాజరైన వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాటు పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. దశాబ్దాలుగా ఉన్న తమ సమస్యకు పరిష్కారం లభించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరంగల్ (మామునూరు) విమానాశ్రయానికి సముచితమైన పేరును సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధాన మవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

### మూడు ప్యాకేజీల్లో పనులు

విమానాశ్రయ నిర్మాణ పనులను ఏఏఐ మూడు ప్యాకేజీలుగా చేపడుతోంది. మొదటి ప్యాకేజీలో 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రన్‌వే, పార్కింగ్, డ్రైనేజీ వ్యవస్థల పనులు ఉంటాయి. మూడో ప్యాకేజీలో భాగంగా రూ. 213.59 కోట్ల అంచనా వ్యయంతో టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, పవర్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటికి సంబంధించిన టెండర్లను నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డిసెంబర్‌లో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

### బండి సంజయ్ మానవత్వం..
## కాన్వాయ్ ఆపి ప్రమాద బాధితులకు సాయం

గాయపడిన వారిని తన భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలింపు

కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని గమనించిన ఆయన, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదానికి గురైన బాధితులను తన భద్రతా వాహనంలోనే ఆసుపత్రికి తరలించి అండగా నిలిచారు. శనివారం సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళు తున్న ఒక కారు రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదం సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి, ముందు సీటులో ఉన్న ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, వెనుక సీటులో కూర్చున్న వారి కుమార్తెకు తల, ముక్కు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళుతున్న బండి సంజయ్ ఈ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, భద్రతా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడంలో స్వయంగా సహాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాలికను, ఆమె తల్లిదండ్రులను వెంటనే తన కాన్వాయ్‌లోని భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్నవారిని సకాలంలో ఆదుకున్న బండి సంజయ్ చొరవను పలువురు అభినందించారు.

# 180 ఎకరాలు మావేనంటున్న రైతులు!

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలోని ప్రభుత్వ భూముల సర్వేలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల భూమిపై రెవెన్యూ, సర్వే అధికారులు చేపట్టిన సర్వే మూడో రోజుకు చేరుకోగా, ఈ వివాదంలోకి పొరుగున ఉన్న వెంకటాపూర్ గ్రామస్థులు ప్రవేశించారు. సర్వే చేస్తున్న భూమిలో తమ వాటా కూడా ఉందని వారు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు.వివరాల్లోకి వెళితే, సర్వే నంబర్ 325 కింద ఉన్న మొత్తం 388 ఎకరాల భూమిలో కేవలం 250 ఎకరాలు మాత్రమే ఎర్రవల్లికి చెందినవని, మిగిలిన సుమారు 180 ఎకరాలు తమ వెంకటాపూర్ గ్రామ పరిధిలోకి వస్తాయని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు పొరపాటున తమ గ్రామ పరిధిలోని భూమిని ఎర్రవల్లి సర్వే నంబర్‌లో కలిపారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఖస్రా, సేత్వార్ పహాణీ వంటి పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వేను పక్కాగా నిర్వహించి, తమ భూమిని గుర్తించి వేరు చేయాలని వారు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు, అధికారులు తమ సర్వే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ భూమిని ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులను గుర్తించే పనిలో భాగంగా వారికి నోటీసులు జారీ చేయడం ప్రారంభించారు. మొత్తం 215 మందికి నోటీసులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, శనివారం ఒక్కరోజే సుమారు 50 మందికి నోటీసులు అందజేశారు. నిర్దేశిత తేదీల్లో రైతులు తమ భూముల వద్దకు వచ్చి, సంబంధిత వివరాలు అందించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.ఈ నెల 21 నుంచి నాలుగు దశల్లో సర్వేను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయ్యాక, క్షేత్రస్థాయిలో ప్రస్తుతం భూమిని సాగు చేస్తున్న, అనుభవంలో ఉన్న రైతులను గుర్తించేందుకు ‘ఎంజాయ్‌మెంట్ సర్వే’ కూడా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అయితే, వెంకటాపూర్ గ్రామస్థుల వాదనతో ఈ సర్వే ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. రెండు గ్రామాల మధ్య నెలకొన్న ఈ సరిహద్దు వివాదాన్ని అధికారులు ఎలా పరిష్కరిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# తెలంగాణలో మళ్లీ కుండపోత.. అల్పపీడనంతో అతిభారీ వర్షసూచన!

**తెలంగాణలో మళ్లీ చురుకైన రుతుపవనాలు.. పలు జిల్లాల్లో భారీ వర్షాలు**

**దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కుండపోత వానలు**

**హైదరాబాద్‌లోనూ పలుచోట్ల రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు**

**ఈనెల 23-25 మధ్య అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పెరిగే అవకాశం**



తెలంగాణలో వర్షాలు మళ్లీ జోరందుకున్నాయి. నిన్నటి నుంచి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలైన మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేటలో కుండపోత వానలు పడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగులో ప్రారంభమైన వానలు.. జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకూ విస్తరించాయి. రానున్న కొన్ని గంటల్లో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు, రెండు రోజులుగా విరామం ఇచ్చిన వానలు శనివారం సాయంత్రం హైదరాబాద్‌ను ముంచెత్తాయి. నగరం యొక్క దక్షిణ, మధ్య ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హయత్‌నగర్‌లో అత్యధికంగా 63.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో 59.5, రాజేంద్రనగర్‌లో 44.3, శివరాంపల్లిలో 44 మిల్లీమీటర్ల వర్షం పడింది. అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్ష తీవ్రత ఒకేలా లేదు. రాబోయే నాలుగైదు రోజులు హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములతో కూడిన వర్షాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు మరో అల్పపీడనం ముప్పు పొంచి ఉంది. సెప్టెంబర్ 23–25 మధ్య బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ అల్పపీడనం ఉత్తర ఆంధ్రప్రదేశ్–దక్షిణ ఒడిశా తీరం వైపుగా పయనిస్తే తెలంగాణలో వర్షాలు మరింత తీవ్రరూపం దాల్చవచ్చు. ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు, దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# డీయూ ఎన్నికల్లో ఏబీవీపీ హవా.. రాహుల్ కార్యక్రమంపై బీజేపీ సెటైర్లు

**ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం**

**నాలుగు కీలక పదవుల్లో మూడింటిని కైవసం చేసుకున్న బీజేపీ అనుబంధ సంస్థ**

**రాహుల్ ‘ఛాత్రోం కీ గూంజ్’ ప్రచారంపై బీజేపీ నేతల విమర్శలు**

**గూంజ్ కాదు, ధమాకా వినిపించిందంటూ జేపీ నడ్డా ఎద్దేవా**

**ఒక్కసీటు కూడా గెలవలేకపోయిన కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యూఐ**



ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం (డీయూఎస్‌యూ) 2026 ఎన్నికల్లో బీజేపీ అనుబంధ విద్యార్థి విభాగం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ప్రభంజనం సృష్టించింది. నాలుగు కీలక కేంద్ర ప్యానెల్ స్థానాల్లో మూడింటిని కైవసం చేసుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ ఫలితాల నేపథ్యంలో, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల నిర్వహించిన “ఛాత్రోం కీ గూంజ్” (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని బీజేపీ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.ఈ విజయంపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ, “నాకు గూంజ్ (ప్రతిధ్వని) వినిపించలేదు, కానీ ధమాకా (పేలుడు) మాత్రం స్పష్టంగా వినిపించింది” అని ఎద్దేవా చేశారు. రాహుల్ ప్రచారాన్ని “ఝూట్ కీ గూంజ్” (అబద్ధాల ప్రతిధ్వని) అని అభివర్ణిస్తూ, ఈ తీర్పు కాంగ్రెస్‌పై విద్యార్థులకు ఉన్న అభిప్రాయానికి నిదర్శనమని పలువురు బీజేపీ నేతలు పేర్కొన్నారు.తాజా ఎన్నికల ఫలితాల ప్రకారం, ఏబీవీపీ అభ్యర్థి యశ్ దబాస్ 24,576 ఓట్లు సాధించి, తన సమీప ప్రత్యర్థి, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనాపై 2,053 ఓట్ల ఆధిక్యంతో అధ్యక్షుడిగా విజయం సాధించారు. కార్యదర్శిగా రియా ఛావడి, సంయుక్త కార్యదర్శిగా లక్ష్య రాజ్ సింగ్ కూడా ఏబీవీపీ తరఫున గెలుపొందారు. అయితే, ఉపాధ్యక్ష పదవిని మాత్రం గతంలో ఎన్ఎస్‌యూఐ సభ్యుడిగా ఉండి, ప్రస్తుతం స్వతంత్రంగా పోటీ చేసిన దీపాన్షు షోకీన్ దక్కించుకున్నారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రహ్లాద్ జోషి, కిరణ్ రిజిజు, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తదితరులు ఏబీవీపీకి అభినందనలు తెలిపారు. “దేశమే ప్రథమం” అనే సిద్ధాంతంతో విద్యార్థి సంక్షేమమే లక్ష్యంగా ఏబీవీపీ పనిచేస్తోందని వారు కొనియాడారు. మరోవైపు, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ ఈ ఎన్నికల్లో ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది. గత ఏడాది ఉపాధ్యక్ష పదవిని దక్కించుకున్న ఎన్ఎస్‌యూఐ, ఈసారి ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవడం గమనార్హం.

# భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ..

భారత ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడేటప్పుడు తరచూ వినిపించే పదం జీడీపీ. దేశం ఎంత అభివృద్ధి చెందుతోంది? ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత స్థానం ఏమిటి? ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయా? పరిశ్రమలు ఎంత వేగంగా విస్తరిస్తున్నాయి? పెట్టుబడులు వస్తున్నాయా? ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయా? ప్రభుత్వం మౌలిక వసతులపై చేస్తున్న వ్యయం ఎంత ఫలితాన్ని ఇస్తోంది? ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానాలను వెతికేటప్పుడు జీడీపీ ఒక ముఖ్యమైన సూచికగా నిలుస్తుంది. అయితే జీడీపీ పెరిగిందంటే దేశంలోని ప్రతి కుటుంబం అదే స్థాయిలో సంపన్నమైందని అర్థం కాదు. జీడీపీ వృద్ధి ఆర్థిక వ్యవస్థ పరిమాణం, ఉత్పత్తి, సేవలు, పెట్టుబడులు వంటి అంశాల వేగాన్ని సూచిస్తుంది. ఆ వృద్ధి ప్రజల జీవితాల్లోకి ఎంతగా చేరింది అన్నదే చివరికి అసలు పరీక్ష.

2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అధికారిక అంచనాల ప్రకారం భారత వాస్తవ జీడీపీ వృద్ధి 7.7 శాతంగా నమోదైంది. నామమాత్ర జీడీపీ 8.9 శాతం పెరిగింది. అదే సంవత్సరంలో స్థూల విలువ ఆధారిత వృద్ధి 7.9 శాతంగా ఉండగా, ద్వితీయ రంగం 8.8 శాతం, తృతీయ రంగం 9.3 శాతం వృద్ధిని నమోదు చేశాయి. తయారీ, వాణిజ్యం, హోటళ్లు, రవాణా, సమాచార సేవలు, ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు వంటి రంగాలు ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన మద్దతు ఇచ్చాయి.

ఈ గణాంకాలను కేవలం ఒక శాతం సంఖ్యగా చూడటం సరిపోదు. ప్రపంచంలోని అనేక పెద్ద ఆర్థిక వ్యవస్థలు మందగమనాన్ని ఎదుర్కొంటున్న సమయంలో భారత్ వేగవంతమైన వృద్ధిని కొనసాగించడం ఒక ముఖ్యమైన అంశం. అయితే వృద్ధి రేటు ఒక్కటే దేశ ఆర్థిక ఆరోగ్యానికి పూర్తి కొలమానం కాదు. పెట్టుబడులు, ఉత్పాదకత, ఉపాధి, తలసరి ఆదాయం, ధరల స్థిరత్వం, ప్రభుత్వ ఆర్థిక స్థితి, ఎగుమతులు, వినియోగ సామర్థ్యం వంటి అనేక అంశాలను కలిపి చూడాల్సిందే.

భారత ఆర్థిక వ్యవస్థ గత దశాబ్దంలో గణనీయమైన మార్పును చూసింది. వ్యవసాయం ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి పరిశ్రమలు, సేవలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, తయారీ, మౌలిక వసతులు, సాంకేతిక రంగాల వైపు దేశ ఆర్థిక నిర్మాణం విస్తరిస్తోంది. ఈ మార్పులో సేవారంగం కీలక పాత్ర పోషిస్తోంది. ఆర్థిక సేవలు, సమాచార సాంకేతిక రంగం, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు, రవాణా, పర్యాటకం, ఆరోగ్యం, విద్య వంటి రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న ప్రాధాన్యాన్ని సంపాదించుకున్నాయి. 2025--26లో తృతీయ రంగం 9.3 శాతం వృద్ధి సాధించడం ఈ ధోరణిని ప్రతిబింబిస్తోంది.

అయితే భారతదేశం ముందున్న అసలు సవాలు వృద్ధి రేటును కొనసాగించడమే. 7 శాతం లేదా అంతకంటే ఎక్కువ వృద్ధి ఒకటి రెండు సంవత్సరాలు సాధించడం కంటే, దశాబ్దాలపాటు అధిక ఉత్పాదకతతో కూడిన వృద్ధిని కొనసాగించడం చాలా కష్టం. దేశ జనాభా భారీగా ఉంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. వారికి తగిన ఉపాధి కల్పించాలంటే సేవారంగం మాత్రమే కాకుండా తయారీ, నిర్మాణం, లాజిస్టిక్స్, పర్యాటకం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఎగుమతి రంగాలు కూడా వేగంగా విస్తరించాలి.

జీడీపీ వృద్ధిలో పెట్టుబడుల పాత్ర అందుకే కీలకం.




2025--26లో స్థిర ధరల వద్ద స్థూల స్థిర మూలధన నిర్మాణం గణనీయంగా పెరిగింది. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు, విద్యుత్ ప్రాజెక్టులు, డిజిటల్ మౌలిక వసతులు వంటి రంగాల్లో పెట్టుబడులు పెరిగితే అవి వెంటనే మాత్రమే కాకుండా భవిష్యత్తులో కూడా ఉత్పాదకతను పెంచగలవు. ఒక మంచి రహదారి కేవలం ప్రయాణ సమయాన్ని తగ్గించదు. అది ఒక పరిశ్రమకు ముడిసరుకు రవాణా ఖర్చును తగ్గిస్తుంది. ఒక విమానాశ్రయం కేవలం ప్రయాణికులను తీసుకెళ్లదు. అది పెట్టుబడిదారులు, నిపుణులు, పర్యాటకులు, సరుకు రవాణాకు కొత్త మార్గాలను తెరుస్తుంది.

ఇక్కడే భారత ఆర్థిక విధానానికి మరో కీలకమైన అంశం కనిపిస్తుంది. మౌలిక వసతులపై ప్రభుత్వ పెట్టుబడి ప్రైవేటు పెట్టుబడులకు వేదికగా మారాలి. ప్రభుత్వం రహదారి నిర్మిస్తే దాని పక్కన పరిశ్రమలు రావాలి. పారిశ్రామిక పార్కులు ఏర్పడితే అక్కడ ఉత్పత్తి ప్రారంభం కావాలి. రైల్వే, పోర్టు, విమానాశ్రయ అనుసంధానం ఉంటే ఎగుమతులు పెరగాలి. లేదంటే భారీగా ఖర్చు చేసిన మౌలిక వసతులు ఆర్థిక వ్యవస్థకు ఆశించినంత ఫలితం ఇవ్వకపోవచ్చు.

భారతదేశం ఇప్పుడు తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన దశలో ఉంది. ప్రపంచ సరఫరా గొలుసుల్లో ప్రత్యామ్నాయ తయారీ కేంద్రాల కోసం అనేక సంస్థలు చూస్తున్నాయి. ఈ అవకాశాన్ని భారత్ ఎంతవరకు ఉపయోగించుకుంటుందన్నదే కీలకం. ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఆటోమొబైల్స్, రక్షణ పరికరాలు, పునరుత్పాదక ఇంధన పరికరాలు, సెమీకండక్టర్లు, యంత్ర పరికరాలు, రసాయనాలు వంటి రంగాల్లో దేశీయ తయారీ సామర్థ్యం పెరగాలి. తయారీ రంగం పెరిగితే ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు సరఫరా గొలుసుల్లో వేలాది చిన్న, మధ్యతరహా సంస్థలకు అవకాశాలు ఏర్పడతాయి.

2025--26లో ద్వితీయ రంగం 8.8 శాతం వృద్ధి నమోదు చేయడం ఈ దిశలో ఒక ముఖ్యమైన పరిణామం. కానీ తయారీ రంగం దీర్ఘకాలికంగా బలపడాలంటే కేవలం ప్రోత్సాహక పథకాలు సరిపోవు. నాణ్యమైన విద్యుత్, నీరు, రవాణా, నైపుణ్యం, సాంకేతికత, పరిశోధన, చౌకైన రుణాలు, ఎగుమతి సౌకర్యాలు, స్థిరమైన విధాన వాతావరణం అవసరం.

భారత జీడీపీ వృద్ధిలో వినియోగం కూడా మరో ముఖ్యమైన ఆధారం. ప్రజలు ఎక్కువగా ఖర్చు చేస్తే వ్యాపారాలకు డిమాండ్ పెరుగుతుంది. డిమాండ్ పెరిగితే ఉత్పత్తి పెరుగుతుంది. ఉత్పత్తి పెరిగితే పెట్టుబడులు, ఉపాధి పెరిగే అవకాశం ఉంటుంది. 2025--26లో ప్రైవేటు తుది వినియోగ వ్యయం కూడా గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. అయితే వినియోగ వృద్ధి దేశంలోని అన్ని ఆదాయ వర్గాల్లో సమానంగా ఉందా అన్న ప్రశ్న కూడా పరిశీలించాలి. అధిక ఆదాయ వర్గాల వినియోగం పెరగడం ఒక అంశం; మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాల కొనుగోలు శక్తి పెరగడం మరో అంశం.

ఇక్కడే జీడీపీ మరియు సాధారణ కుటుంబ జీవితం మధ్య తేడా స్పష్టమవుతుంది. దేశ జీడీపీ పెరుగుతుండవచ్చు. కానీ ఒక కుటుంబానికి ఉద్యోగం లేకపోతే లేదా ఆదాయం ధరల పెరుగుదల కంటే నెమ్మదిగా పెరిగితే ఆ కుటుంబం తన జీవితంలో ఆర్థిక వృద్ధిని అనుభవించకపోవచ్చు. అందుకే తలసరి ఆదాయం, వాస్తవ వేతనాలు, ఉపాధి, ద్రవ్యోల్బణం, విద్య, ఆరోగ్యం వంటి సూచికలను కూడా సమాంతరంగా పరిశీలించాలి.

తెలంగాణకు ఈ చర్చ ప్రత్యేకంగా ప్రాధాన్యం కలిగి ఉంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సేవారంగం బలంగా ఉంది. హైదరాబాద్ సమాచార సాంకేతిక రంగం, ఔషధ పరిశ్రమలు, జీవసాంకేతిక రంగం, రియల్ ఎస్టేట్, వైద్య సేవలు, విద్య, రవాణా, ఆర్థిక సేవలకు ప్రధాన కేంద్రంగా ఎదిగింది. అదే సమయంలో వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, కొత్తగూడెం వంటి ప్రాంతాల్లో కూడా ప్రాంతీయ ఆర్థిక కేంద్రాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ అధికారిక గణాంకాల ప్రకారం 2024--25లో రాష్ట్ర స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి ప్రస్తుత ధరల వద్ద రూ.16.12 లక్షల కోట్లకు పైగా ఉంది. అదే సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.79 లక్షలుగా అంచనా వేయబడింది. జాతీయ తలసరి ఆదాయం రూ.2.05 లక్షలుగా నమోదైంది. ఈ తేడా తెలంగాణ ఆర్థిక సామర్థ్యాన్ని సూచిస్తున్నప్పటికీ, రాష్ట్రంలోని అన్ని జిల్లాలు ఒకే స్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయని మాత్రం అర్థం కాదు.

తెలంగాణలో ప్రాంతీయ అసమానతలను తగ్గించడం భవిష్యత్ ఆర్థిక విధానానికి కీలకమైన లక్ష్యం కావాలి. హైదరాబాద్ చుట్టూ పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక వసతులు కేంద్రీకృతమైతే ఇతర ప్రాంతాల నుంచి వలసలు కొనసాగుతాయి. బదులుగా జిల్లాల స్థాయిలో ఆర్థిక కేంద్రాలను నిర్మిస్తే స్థానికంగానే ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. కొత్త విమానాశ్రయాలు, రహదారులు, రైల్వే అనుసంధానాలు, పారిశ్రామిక పార్కులు, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు, విద్యా సంస్థలు, వైద్య కేంద్రాలు ఈ ప్రాంతీయ అభివృద్ధికి పునాది కావచ్చు.

ఈ నేపథ్యంలో తెలంగాణలో కొత్త విమానాశ్రయాలపై జరుగుతున్న చర్చ కూడా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థతో నేరుగా అనుసంధానమవుతుంది. వరంగల్ మామునూరు, ఆదిలాబాద్ వంటి ప్రాజెక్టులు కేవలం ప్రయాణ సౌకర్యాలకు సంబంధించినవి కావు. వాటి చుట్టూ పరిశ్రమలు, లాజిస్టిక్స్, పర్యాటకం, సేవారంగం, ఉపాధి అవకాశాలు పెరిగితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా పరోక్షంగా మద్దతు లభించవచ్చు. మౌలిక వసతులు ఆర్థిక కార్యకలాపాలకు అనుసంధానమైనప్పుడే వాటి అసలు విలువ బయటపడుతుంది.

ప్రాంతీయ విమానాశ్రయాల నిర్మాణం, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, రైల్వే అనుసంధానాలు- ఇవి ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉండాలి.

# రియాద్‌ను టార్గెట్ చేసిన హౌతీ రెబల్స్.. దద్దరిల్లిన సౌదీ అరేబియా

**సౌదీ రాజధాని రియాద్‌పై హౌతీ రెబల్స్ బాలిస్టిక్ క్షిపణితో దాడి**

**రియాద్‌లోని విమానాశ్రయం సమీపంలోని అరామ్కో ఇంధన డిపోలో చెలరేగిన మంటలు**

**దాడిని విజయవంతంగా అడ్డుకున్నామని ప్రకటించిన సౌదీ సంకీర్ణ దళాలు**

**రియాద్, యాన్బులోని కీలక ప్రాంతాలపై దాడులు చేశామన్న హౌతీలు**

**యెమెన్‌లో ఘర్షణలు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించిన అమెరికా**



సౌదీ అరేబియా రాజధాని రియాద్ క్షిపణుల మోతతో దద్దరిల్లింది. యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ రెబల్స్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ప్రకటించాయి. అయితే, ఈ దాడి కారణంగా రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉన్న సౌదీ ఆయిల్ దిగ్గజం అరామ్కోకు చెందిన ఇంధన డిపోలో భారీ అగ్నిప్రమాదం సంభవించడం తీవ్ర కలకలం రేపింది. ఎయిర్‌పోర్ట్ సమీపంలో దట్టమైన నల్లటి పొగలు కమ్ముకున్న దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి.

హౌతీ ఉగ్రవాద మిలీషియా రియాద్ నగరాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని తమ వాయుసేన విజయవంతంగా అడ్డుకుని ధ్వంసం చేసిందని సంకీర్ణ దళాల ప్రతినిధి తుర్కీ అల్-మల్కీ తెలిపారు. కేవలం రియాద్‌నే కాకుండా బిషా, తైఫ్, ఘరాసన్, యాన్బు నగరాల్లోని పౌర ప్రాంతాలను కూడా హౌతీలు లక్ష్యంగా చేసుకున్నారని, ఆ దాడులను కూడా తమ గగనతల రక్షణ వ్యవస్థలు విఫలం చేశాయని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, ఈ దాడులను హౌతీ రెబల్స్ ధ్రువీకరించారు. సౌదీ దాడులకు ప్రతీకారంగానే తాము ఈ సైనిక చర్యలు చేపట్టామని హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరీ తెలిపారు. పెద్ద సంఖ్యలో బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్‌లతో రెండు విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించామని, రియాద్‌లోని సున్నితమైన ప్రాంతాలతో పాటు యాన్బులోని అరామ్కో సౌకర్యాలను లక్ష్యంగా చేసుకున్నామని ఆయన టెలిగ్రామ్‌లో వెల్లడించారు.

శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రియాద్ నగరవాసులకు 'వైమానిక దాడి ముప్పు' హెచ్చరికలు అందాయి. ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. కాసేపటికే భారీ పేలుడు శబ్దాలు వినిపించాయని, కిటికీలు కంపించాయని స్థానికులు మీడియాకు తెలిపారు. ఈ దాడి చాలా భయానకంగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దాడుల కారణంగా కింగ్ ఖలీద్ విమానాశ్రయంలో విమాన ప్రయాణాలకు అంతరాయం ఏర్పడిందని 'ఫ్లైట్‌రాడార్24' వెబ్ సైట్ నివేదించింది.

ఇటీవల యెమెన్‌లో హౌతీ రెబల్స్ దూకుడు పెంచి అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో సౌదీ మద్దతు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఈ ఘర్షణలు వేగంగా పెరిగే ప్రమాదం ఉందని అమెరికా హెచ్చరిక జారీ చేసింది.

ఇదిలా ఉంటే.. గతవారం హౌతీలపై దాడి చేయాలన్న సౌదీ అభ్యర్థనను అమెరికా తిరస్కరించిందని వార్తలు వచ్చాయి. అయినప్పటికీ, సౌదీకి రక్షణ కల్పించేందుకు 24.3 బిలియన్ డాలర్ల విలువైన 48 ఫీ-35 యుద్ధ విమానాల అమ్మకానికి వాషింగ్టన్ ఆమోదం తెలిపింది.

2014లో యెమెన్ రాజధాని సనాతో పాటు ఇతర ప్రాంతాలను హౌతీలు స్వాధీనం చేసుకోవడంతో అక్కడ అంతర్యుద్ధం మొదలైంది. 2015లో సౌదీ అరేబియా సైనిక జోక్యం చేసుకుంది. 2022లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం జులైలో విఫలమవడంతో ఘర్షణలు మళ్లీ తీవ్రమయ్యాయి.

ఈ పోరాటం వల్ల 1,12,000 మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ఇరుపక్షాలు చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని, కానీ ప్రస్తుతం దాడుల ఉచ్చులో చిక్కుకున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సంపాదకీయం

# తెలంగాణ ఆకాశంలో కొత్త గమ్యాలు

విమానాశ్రయం అంటే కేవలం విమానాలు వచ్చి వెళ్లే ప్రదేశం కాదు. ఒక ప్రాంతం ఆర్థిక భవిష్యత్తుకు అది ఒక ద్వారం. రహదారులు, రైల్వేలు ప్రజలను కలుపుతాయి. విమానాశ్రయాలు మాత్రం పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటకం, సేవారంగం, ఉపాధి అవకాశాలను వేగంగా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తీసుకెళ్లగలవు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనలు, ముఖ్యంగా వరంగల్ మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి ప్రయత్నాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికల్లో నిజామాబాద్ జక్రాన్‌పల్లి, పెద్దపల్లి, కొత్తగూడెం వంటి ప్రాంతాల్లో ప్రాంతీయ విమానాశ్రయాలను కూడా ప్రతిపాదించింది. రాష్ట్ర 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికలో ఇవి ప్రాంతీయ విమాన అనుసంధానంలో భాగంగా పేర్కొనబడ్డాయి.

ప్రస్తుతం హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తెలంగాణకు ప్రధాన విమాన ద్వారంగా ఉంది. రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో, దేశంలోని వివిధ నగరాలతో అనుసంధానం చేయడంలో, విదేశీ ప్రయాణాలకు మార్గం కల్పించడంలో దాని పాత్ర ఎంతో కీలకం. అయితే రాష్ట్రం భౌగోళికంగా విస్తరిస్తున్న కొద్దీ, పరిశ్రమలు కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్న కొద్దీ, ఒకే నగరంపై ఆధారపడిన విమాన రవాణా వ్యవస్థకు పరిమితులు కనిపించడం సహజం. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న అభివృద్ధిని ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ ప్రాంతాలకు విస్తరించాలంటే రహదారులు, రైల్వేలతో పాటు విమాన అనుసంధానం కూడా అవసరం. అందుకే కొత్త విమానాశ్రయాల ఆలోచనను కేవలం రవాణా ప్రాజెక్టుగా కాకుండా ప్రాంతీయ అభివృద్ధి వ్యూహంగా చూడాల్సిన అవసరం ఉంది.

ముఖ్యంగా మామునూరు విమానాశ్రయం విషయంలో ఇటీవలి పరిణామాలు ప్రాజెక్టు ముందుకు కదులుతున్న సంకేతాలను ఇస్తున్నాయి. 2026 సెప్టెంబర్ 2న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడితో సమావేశమై ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తయి అప్పగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మామునూరు విమానాశ్రయానికి టెండర్లు రెండు వారాల్లో పిలిచి, డిసెంబర్‌లో ఖరారు చేసి, అదే నెలలో పునాది పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి వెల్లడించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన పేర్కొంది.

ఇది వరంగల్‌కు మాత్రమే సంబంధించిన విషయం కాదు. మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్ చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు కూడా విమాన ప్రయాణం సులభమయ్యే అవకాశం ఉంటుంది. వరంగల్ ఇప్పటికే తెలంగాణలో ఒక ప్రధాన పట్టణ కేంద్రంగా ఎదుగుతోంది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట రైల్వే సంబంధిత అభివృద్ధి, విద్యా సంస్థలు, వైద్య సేవలు, చిన్నతరహా పరిశ్రమలు, పర్యాటక కేంద్రాలు కలిసి ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన ఆర్థిక స్వరూపాన్ని ఇస్తున్నాయి. విమానాశ్రయం ఈ వ్యవస్థకు వేగాన్ని జోడించగలదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వరంగల్‌ను ఉత్తర తెలంగాణకు కీలక కేంద్రంగా అభివృద్ధి చేయాలని చూస్తున్నట్లు అధికారిక ప్రకటనల్లో పేర్కొంది. అయితే విమానాశ్రయం నిర్మాణం పూర్తయిందంటే అభివృద్ధి పూర్తయినట్లు కాదు. అసలు పరీక్ష ఆ తర్వాతే ప్రారంభమవుతుంది. ఎన్ని విమానాలు నడుస్తాయి? ఏ నగరాలకు నేరుగా కనెక్టివిటీ ఉంటుంది? ప్రయాణికుల సంఖ్య ఎంత ఉంటుంది? విమానయాన సంస్థలకు ఈ మార్గాలు ఎంతవరకు వాణిజ్యపరంగా ఉపయోగకరంగా ఉంటాయి? విమానాశ్రయానికి చేరుకునే రహదారులు ఎలా ఉంటాయి? రైల్వే అనుసంధానం ఎంతవరకు ఉంటుంది? పార్కింగ్, ప్రజా రవాణా, టాక్సీలు, హోటళ్లు, సరుకు రవాణా వంటి అనుబంధ వ్యవస్థలు ఎలా ఉంటాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు లేకుండా కేవలం రన్‌వే, టెర్మినల్ నిర్మించడం వల్ల ఆశించిన ప్రయోజనం రావడం కష్టం.

ఇక్కడే తెలంగాణ ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక అవసరం. ఒక విమానాశ్రయాన్ని నిర్మించేటప్పుడు దాని చుట్టూ కనీసం 20 నుంచి 25 ఏళ్ల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా భవిష్యత్ గ్రోత్ కారిడార్లను 25 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా రూపొందించాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించింది. రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో పెట్టుకుని పట్టణాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని కూడా పేర్కొంది. వరంగల్ విషయంలో ఈ సమన్వయం మరింత ముఖ్యమైనది. విమానాశ్రయం ఒక వైపు, ఔటర్ రింగ్ రోడ్డు మరోవైపు, పరిశ్రమలు మరోవైపు ఉంటే సరిపోదు. ఇవన్నీ పరస్పరం అనుసంధానమై ఉండాలి. విమానాశ్రయం నుంచి నగరానికి చేరుకోవడానికి గంటల తరబడి పట్టే పరిస్థితి ఉంటే విమాన ప్రయాణం వల్ల కలిగే ప్రయోజనం తగ్గిపోతుంది. విమానాశ్రయం నుంచి పారిశ్రామిక పార్కులు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్, ప్రధాన నగర కేంద్రాలకు వేగవంతమైన రవాణా ఉండాలి. భవిష్యత్తులో నగరం విస్తరించే దిశను ముందుగానే గుర్తించి రహదారుల సామర్థ్యాన్ని పెంచాలి.

ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం మరొక ప్రత్యేకమైన ప్రాజెక్టు. ఇది సాధారణ పౌర విమానాశ్రయంతో పాటు రక్షణ అవసరాలను కూడా కలుపుకుని అభివృద్ధి చెందే అవకాశముంది. రాష్ట్ర ప్రభుత్వం 2026లో కేంద్ర రక్షణ శాఖతో జరిపిన చర్చల్లో ఆదిలాబాద్‌లో భారత వాయుసేన ఆధ్వర్యంలో అభివృద్ధి చెందనున్న విమానాశ్రయానికి పౌర ప్రయాణికుల టెర్మినల్, కార్గో, ఎంఆర్ఓ, హ్యాంగర్ సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని కోరింది. ఆదిలాబాద్ విషయంలో భూసేకరణ అంశం కూడా కీలకంగా ఉంది. 2026 సెప్టెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు సేకరించిందని, రక్షణ శాఖ కోరిన మేరకు మరో 750 ఎకరాలు సేకరించేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర రక్షణ మంత్రికి తెలిపింది. జిల్లాకు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్‌లో సంయుక్త వినియోగ విమానాశ్రయానికి 2,009.23 ఎకరాల మేర భూభాగానికి సంబంధించిన ప్రకటనలు కూడా కనిపిస్తున్నాయి.

ఆదిలాబాద్ విమానాశ్రయం కేవలం ప్రయాణికుల రాకపోకలకు పరిమితం కాకుండా విమానయాన ఆధారిత పారిశ్రామిక వ్యవస్థగా ఎదిగే అవకాశం ఉంది. ఎంఆర్ఓ అంటే విమానాల నిర్వహణ, మరమ్మతులు, సమగ్ర తనిఖీలు జరిగే రంగం. హ్యాంగర్ సదుపాయాలు, కార్గో కేంద్రాలు, విమాన శిక్షణ సంస్థలు ఏర్పడితే విమానాశ్రయం చుట్టూ కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చు. సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లు, నిర్వహణ సిబ్బంది, భద్రతా సిబ్బంది, లాజిస్టిక్స్ రంగం, హోటళ్లు, రవాణా రంగం వంటి అనేక విభాగాలకు ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం కూడా ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో ఎంఆర్ఓ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అయితే ఇలాంటి ప్రాజెక్టుల్లో ఒక ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. పెద్ద మౌలిక వసతుల నిర్మాణాన్ని అభివృద్ధికి ప్రత్యామ్నాయంగా భావించడం. విమానాశ్రయం నిర్మిస్తే పరిశ్రమలు వాటంతట అవే వస్తాయని భావించడం సరికాదు. విమానాశ్రయంతో పాటు పరిశ్రమలకు భూమి, విద్యుత్, నీరు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, లాజిస్టిక్స్, డిజిటల్ మౌలిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉండాలి. విమానాశ్రయం ఈ మొత్తం వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగం మాత్రమే. తెలంగాణకు ఉన్న మరో పెద్ద సవాలు ప్రాంతీయ సమతుల్యత. హైదరాబాద్ చుట్టూ అభివృద్ధి కేంద్రీకృతమైతే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు వెనుకబడే అవకాశం ఉంది. కొత్త విమానాశ్రయాలు ఈ అసమానతను తగ్గించే సాధనాలుగా ఉపయోగపడాలి. వరంగల్‌కు విమానాశ్రయం వస్తే దాని ప్రభావం కేవలం వరంగల్ నగరానికి పరిమితం కాకూడదు. భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, హనుమకొండ, పరిసర ప్రాంతాల ఆర్థిక కార్యకలాపాలకు అది ఉపయోగపడాలి. అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయం ఉత్తర తెలంగాణలోని దగార ప్రాంతాలకు అందుబాటులో ఉండేలా రోడ్డు అనుసంధానాన్ని మెరుగుపరచాలి.



-గుర్రం పాపిరెడ్డి
-ఎడిటర్

# జక్కుల చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన




ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని జక్కుల చెరువులో వినాయక నిమజ్జనోత్సవానికి సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి--శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్‌రెడ్డిలు స్థానిక సీఐ, ఎస్ఐలతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రదేశంలో భక్తులకు, వినాయక విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన సమయంలో వాహనాల రాకపోకలు, భక్తుల భద్రత, అవసరమైన మౌలిక సదుపాయాలపై పోలీసు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనానికి వచ్చే భక్తులు, వాహనాలకు తగిన సౌకర్యాలు కల్పించాలని సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సూచించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి--శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంతోష్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సొంత వ్యాపారంతోనే స్వయం సమృద్ధి

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 19: ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తూ కాలాన్ని వృథా చేయకుండా యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని సొంత కాళ్లపై నిలదొక్కుకోవాలని రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెల్ పాయింట్ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం రాలేదని యువత నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. కష్టపడే మనస్తత్వం, పట్టుదల, స్వయంకృషితో సొంతంగా వ్యాపారం ప్రారంభించి స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో నాణ్యమైన సేవలు అందించేందుకు సెల్ పాయింట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సెల్ పాయింట్ నిర్వాహకుడు సయ్యద్ ఫారూక్‌ను ప్రజాప్రతినిధులు అభినందించారు. నూతన వ్యాపారంలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, సయ్యద్ ఫారూక్ కుటుంబ సభ్యులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# వినాయక మండపాలను సందర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 19: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షులు రెడ్డబోయిన గోపి కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు సిరిసిల్ల పట్టణంలోని వివిధ వినాయక మండపాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా వినాయక మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పలు మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో రెడ్డబోయిన గోపి పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు, స్థానిక భక్తులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి స్వాగతం పలికారు. ఆయన వెంట బీజేపీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# అల్మాస్పూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా మాతృ వందనం

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 19: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం), మాతృ వందనం, నో బ్యాగ్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక, సహపాఠ్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సమావేశానికి హాజరైన తమ తల్లిదండ్రులను విద్యార్థులు ఘనంగా సత్కరించి, పూలదండలు, శాలువాలు, చిరుకానుకలు అందించారు. తల్లిదండ్రుల పట్ల తమకున్న గౌరవం, ప్రేమను చాటుకున్నారు. నైతిక విలువల్లో భాగంగా తల్లిదండ్రులను గౌరవించాలనే భావనను విద్యార్థుల్లో పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు తాము పొదుపు చేసుకున్న డబ్బులతో తల్లిదండ్రులకు గిఫ్టులు, పూలదండలు అందించి సన్మానించడం తల్లిదండ్రులను ఆకట్టుకుంది. విద్యార్థుల చొరవను తల్లిదండ్రులు అభినందిస్తూ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రశంసించారు. కార్యక్రమానికి హాజరైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సిరిసిల్ల రేణుక విద్యార్థులకు సుమారు రూ.1,000 విలువైన నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థుల చదువుకు సహకరిస్తున్నందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టేకుమల్ల శ్రీకాంత్, ఉపాధ్యాయులు రాజయ్య, సౌజన్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కోనరావుపేట వ్యవసాయ సహకార సంఘం నూతన కమిటీ నియామకం

::: చైర్మన్‌గా చేపూరి గంగాధర్



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట వ్యవసాయ సహకార సంఘం నూతన కమిటీని నియమించారు. సంఘం చైర్మన్‌గా చేపూరి గంగాధర్‌ను నియమించగా, మరో 12 మందిని సభ్యులుగా నియమించారు. నూతన కమిటీ సభ్యులుగా మనువాడ భూమయ్య, కులేరు సత్తవ్వ, నునవత్ శంకర్, ముదాం సత్తయ్య, కర్రే శంకరయ్య, మోతే రాంరెడ్డి, నాలుక సత్యం, రావులపల్లి మహిపాల్‌రెడ్డి, గుమ్మడి అమృతరావు, తాళ్లపల్లి రాజయ్య, భూక్యా ప్రకాష్, నేవూరి పుష్పలత నియమితులయ్యారు. మొత్తం 13 మందితో నూతన వ్యవసాయ సహకార సంఘం కమిటీ ఏర్పాటైంది. నూతనంగా నియమితులైన చైర్మన్, సభ్యులు సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

# స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడిగా గజ్జెల ప్రశాంత్



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ (ఎస్‌డీసీ) అధ్యక్షుడిగా గజ్జెల ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన భూక్యా గజన్ ఎన్నికల వివరాలను వెల్లడించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా గజ్జెల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా దోమకొండ రాజేశ్వరి, ఉపాధ్యక్షులుగా మల్యాల సరిత, పోతుగంటి కవిత, కోశాధికారిగా గుంటుకు నరేందర్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాఠశాల సిబ్బంది నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గతంలో ఎస్‌డీసీ అధ్యక్షుడిగా పనిచేసిన ప్రస్తుత గ్రామ సర్పంచ్ రాకేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఎస్‌డీసీ అధ్యక్షుడిగా నిస్వార్థంగా చేసిన సేవ తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సైతం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాల పూర్వ విద్యార్థినని, పాఠశాల సమస్యల పరిష్కారం, విద్యార్థుల అభివృద్ధి కోసం నూతన కమిటీ సభ్యుల సహకారంతో నిస్వార్థంగా పనిచేస్తానని తెలిపారు. నూతన కమిటీ సభ్యులను గ్రామ సర్పంచ్ రాకేష్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ శ్రావణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కులేరి ప్రేమ్‌సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



# ఎంపిపిఎస్ పెద్దతండా-కెలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రం పెద్దతండా–కే పాఠశాలలో పి టి ఎం సమావేశం సందర్భంగా తీజ్ పండుగ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తీజ్ పండుగ విశిష్టతను తెలియజేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేలా, మన సంస్కృతి మరియు సంప్రదాయాలను పరిచయం చేసేలా కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు. శ్రేసు ఉపాధ్యాయుడు సమన్వయం తో ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచింది. కార్యక్రమ ప్రణాళిక, విద్యార్థులకు మార్గదర్శకత్వం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు విద్యార్థులను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు.అనిల్ మరియు నవీన్ ఉపాధ్యాయులు కూడా కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాల ప్రగతితో పాటు విద్యార్థుల విద్యా, సాంస్కృతిక అభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయం. ప్రిన్సిపాల్ మంజుల నాయకత్వంలో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

# ఎం బి బి ఎస్ సాధించిన మానస



అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రంలో పెద్దతండ కే గ్రామంలో బానోతు మానస తండ్రి కిషన్ వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎం బి బి ఎస్ సీటు సాధించిన మానసకు గ్రామస్థులు, కుటుంబా సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.




# గిద్ద చెరువులో వినాయక నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్ద చెరువులో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న వినాయక నిమజ్జనోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నిమజ్జన ఏర్పాట్లను ఎల్లారెడ్డిపేట సీఐ ఓ. వెంకటేశ్, ఎస్ఐ ఎన్. రమేష్, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనుగందుల నరసింహులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఐ వెంకటేశ్ సూచించారు. గ్రామంలో నిమజ్జన కమిటీని ఏర్పాటు చేసి ఉత్సవాల నిర్వహణను సమన్వయం చేసుకోవాలని సర్పంచ్ నరసింహులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఎనుగందుల నరసింహులు తెలిపారు. అలాగే గిద్ద చెరువులో విగ్రహాల నిమజ్జనం కోసం ఈ ఏడాది తొలిసారిగా క్రేన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమజ్జన కార్యక్రమంలో క్రేన్ అందుబాటులో ఉండటం వల్ల భక్తులకు, నిర్వాహకులకు మరింత సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. వినాయక నిమజ్జనోత్సవాల కోసం చేపడుతున్న ఏర్పాట్లను సీఐ వెంకటేశ్, ఎస్ఐ రమేష్ పరిశీలించి సర్పంచ్ నరసింహులను అభినందించారు. పోలీసు, గ్రామపంచాయతీ శాఖల సమన్వయంతో నిమజ్జనోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్‌రెడ్డి, బుచ్చిలింగం సంతోష్‌గౌడ్, గన్న శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు పారిపెల్లి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ నియంత్రిక ప్రారంభం

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామ శివారులో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన విద్యుత్ నియంత్రికను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్కే సాబేరా బేగం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌పీడీసీఎల్ పరిధిలోకి వచ్చిన అనంతరం గ్రామాల్లో విద్యుత్ సమస్యలు క్రమంగా మెరుగుపడుతున్నాయని తెలిపారు. విద్యుత్ స్తంభాలు లేని కాలనీలు, లూజ్ లైన్లు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు మీటర్‌కు సంబంధించిన రుసుము చెల్లిస్తే కిలోమీటర్ పరిధి వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు వేయడం జరుగుతుందని వివరించారు. మండలంలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే ఏఈ రాకేష్‌రెడ్డి, డీఈ అంజయ్య త్వరితగతిన స్పందించి సమస్యలను పరిష్కరిస్తున్నారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది మరింత కృషి చేయాలని కోరారు. నారాయణపూర్ గ్రామంలో చాలాకాలంగా ఉన్న లో–వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ నియంత్రికను ఏర్పాటు చేసినట్లు సాబేరా బేగం తెలిపారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, వైస్ చైర్మన్ గుండాటి రామ్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచులు ఎలగందుల నర్సయ్య, కల్లూరు బాపురెడ్డి, మేడిపల్లి జ్యోతి దేవానందం, ఉపసర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిద రాజేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మండే శ్రీనివాస్, గంట చిన్నలక్ష్మి, విద్యుత్ శాఖ లైన్‌మెన్లు రమేష్, ప్రవీణ్, అసిస్టెంట్ హెల్పర్ సతీష్, నాయకులు ఎస్కే గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, నిమ్మ మల్లారెడ్డి, దొమ్మాట దేవయ్య, ఎస్కే సమ్మద్, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవల్లిలో వైభవంగా గణేష్ నవరాత్రోత్సవాలు

## గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎన్.సి. సంతోష్



గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఎర్రవల్లి గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణేష్ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎన్.సి. సంతోష్ మండపాన్ని సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపానికి విచ్చేసిన ఎన్.సి. సంతోష్‌కు అంబేద్కర్ యూత్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్.సి. సంతోష్ మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. వార్డులో ఆధ్యాత్మిక చింతనతో పాటు ఐక్యతను పెంపొందించేలా అంబేద్కర్ యూత్ సభ్యులు ప్రతి ఏటా గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ గ్రామాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. గణేష్ నవరాత్రోత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మానవ సేవయే మాధవ సేవగా జీవన విధానం ఉండాలి

## ఈఎన్‌టీ ఆసుపత్రి యాజమాన్య బృందం డాక్టర్ రాజామోహన్, డాక్టర్ హైమావతి



గజ్వేల్ అరుణ ప్రభ : మానవ సేవయే మాధవ సేవ అనే విధానంతో ప్రతి ఒక్కరి జీవన విధానం కొనసాగాలని ఈఎన్‌టీ ఆసుపత్రి యాజమాన్య బృందం డాక్టర్ రాజామోహన్, డాక్టర్ హైమావతి అన్నారు. అయ్యప్పనగర్ కాలనీలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను వారు సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 24 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని ప్రశంసించారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించేలా మహిళల కోలాటాలు, విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు, క్విజ్ పోటీలు, కుటుంబ సమ్మేళనాలు, అన్నప్రసాదం, అల్పాహార కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా కాలనీవాసుల మధ్య ఐక్యత, సోదరభావం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. అయ్యప్పనగర్ కాలనీలో కొలువుదీరిన గణనాథుడిని దర్శించుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సృష్టిలో భాగంగా మానవ శరీరంలోని చెవి, ముక్కు, గొంతు వంటి జ్ఞానేంద్రియాలు బాహ్య ప్రపంచంలోని అంశాలను గ్రహించి మనిషి మనుగడకు ఎంతో సహకరిస్తాయని తెలిపారు. ఈ అవయవాలకు సంబంధించిన సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు సరైన చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని అన్నారు. చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న ప్రజలు తమను సంప్రదిస్తే చికిత్స విషయంలో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని డాక్టర్ రాజామోహన్, డాక్టర్ హైమావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులు మోతె వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, ఉపాధ్యక్షులు గుజ్జేటి రాంచంద్రం, కోశాధికారి అలివేలు నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శులు ఎ. గోపాల్‌రెడ్డి, వగ్గు మల్లేశం, ఆర్. అంజిరెడ్డి, కమిటీ సభ్యులు పంజాల నరేష్ గౌడ్, ఎ. యాదగిరి, బండారు సీతారామ్, సీహెచ్. మధుసూదన్‌రెడ్డి, రేపాల గోవిందు, ఎస్. మల్లయ్య గౌడ్, జి. రాజులు, సతీష్‌రెడ్డితో పాటు అధిక సంఖ్యలో మహిళలు, యువజన సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆదర్శ్‌నగర్ గణనాథ మండపం వద్ద సేవా సంకల్ప్ అభియాన్

## చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో 1000 మందికి అన్న ప్రసాద వితరణ



శేరిలింగంపల్లి సెప్టెంబరు 19:(అరుణ ప్రభ) : శేరిలింగంపల్లి ఆదర్శ్ నగర్ యూత్ అసోసియేషన్ గణనాథ మండపం వద్ద బిజెపి రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించి, వెయ్యి మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 మొదలు అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా చింతకింది గోవర్ధన్ గౌడ్ వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఐదు గణనాథ మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఇది ఆదర్శంగా తీసుకుని బిజెపి నాయకులు, మోడీ అభిమానులు వాడవాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం చింతకింది గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ పేరిట అన్న ప్రసాద వితరణ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆదర్శ్ నగర్ కాలనీ యూత్, లింగంపల్లి రేయిన్ ట్రీ కమ్యూనిటీ, గోపి నగర్ బజరంగ్ యూత్, ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గణనాథ మండపాల వద్ద దాదాపు 6 వెల మందికి పైగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్రరావు, నాగేశ్వరరావు, రంగా గౌడ్, బెజగం కేశవులు, పుట్ట వినయకుమార్ గౌడ్, గోపాల్ యాదవ్, శ్రీనివాస్ నాయి, రవీందర్ రెడ్డి, అల్లూరయ్య, శ్రీనివాసరావు, అరుణ్ గౌడ్, డాకయ్య గౌడ్, కృష్ణ, శ్రీకాంత్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ అయోధ్య నగర్ కాలనీలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

**ఐదవ రోజు పూజలో భాగంగా మహిళల సామూహిక కుంకుమార్చన**

**మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం**

**ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ రసాల వెంకటేష్ యాదవ్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు చిగురు రవికుమార్ ముదిరాజ్**



సెప్టెంబర్ 19, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బొల్లి గూడెం అయోధ్య నగర్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జే జెనిగే ఆంజనేయులు కాలనీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇక్కడ ప్రత్యేకత మట్టి గణపతిని పూజించడం,పర్యావరణ పరిరక్షణ సహజ మట్టితో తయారైన గణపతి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోతాయి, నీటి కాలుష్యం తగ్గుతుంది ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో పోలిస్తే నీటి వనరులకు హాని తక్కువగా ఉంటుంది,జలచరాల రక్షణ విషపూరిత రంగులు, రసాయనాలు నీటిలో కలవకుండా ఉండటంతో జలచరాలకు మేలు జరుగుతుంది,మట్టి పునర్వినియోగం నిమజ్జనం తర్వాత మట్టి తిరిగి భూమిలో కలిసిపోతుంది, సంప్రదాయానికి దగ్గరగా సహజ పదార్థాలతో విగ్రహాన్ని తయారు చేసి పూజించడం భారతీయ సంప్రదాయానికి అనుగుణంగా ఉంటుంది, భవిష్యత్ తరాలకు మంచి సందేశం పండుగలను జరుపుకుంటూనే ప్రకృతిని కాపాడాలనే అవగాహన పెరుగుతుంది.మట్టి గణపతిని పూజించడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి, ఉత్సవాల్లో భాగంగా మహిళలు కుంకుమార్చన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలందరికీ విఘ్నాలు తొలగి శుభాలు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాలను కాలనీ ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నామని,భక్తుల భాగస్వామ్యంతో ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రతినిత్యం అన్నప్రసాద పంపిణీ విజయవంతంగా ప్రతిరోజు చేస్తున్నామని, అదేవిధంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి గణపతిని ప్రతిష్టించి ఘనంగా పూజలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డిండి తహసిల్దార్‌కు జన్మదిన శుభాకాంక్షలు

అరుణ ప్రభ డిండి సెప్టెంబర్ 19 : దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని డిండి మండల తహసిల్దారుగా పనిచేస్తున్న హనుమంతు శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని, శనివారం తహసిల్దార్ కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో సింగరాజుపల్లి మాజీ సర్పంచ్ మనోహరరావు , డిండి రిటైర్డ్ టీచర్ వంగాల శేఖర్ రెడ్డి ,రామావత్ గోపాల్ నాయక్, రామావత్ పార్వతి తదితరులు పాల్గొన్నారు . తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్ జన్మదినం సందర్భంగా మండలంలోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు,,మాజీ ప్రజాప్రతినిధులు,,కార్యాలయం సిబ్బందిశుభాకాంక్షలు తెలియజేశారు.



# కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా దిండి ప్రాజెక్టుకు వెంటనే నీరు అందించాలి

అరుణ ప్రభ ,దిండి, సెప్టెంబర్ 19,డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో సుమారు 12,500 ఎకరాల్లో సాగుతున్న వరి పంటకు నీటి కొరత ఏర్పడిన దృష్ట్యా ,ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.ఈ నేపథ్యంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా తక్షణమే దిండి ప్రాజెక్టులోకి నీటిని అందించే ఆయకట్టు వరి పంటలు కాపాడాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు ఈ మేరకు శనివారం బిజెపి నాయకులు గుడిపల్లి మోటార్ వద్ద, చెట్ల చెన్నారం ప్రాంతంలో నార్లాపూర్ కేఎల్ఐ మెయిన్ పంప్ హౌస్లలో పర్యటించి నీటి పరిస్థితిని పరిశీలించారు.రైతులు పంటలు వేసుకున్న తర్వాత నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి రావడం ప్రభుత్వ పాలన వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు.స్థానిక ఎమ్మెల్యే రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి దిండి ప్రాజెక్టుకు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవలసిన బాధ్యత నిర్వర్తించాలని బిజెపి నాయకు లు డిమాండ్ చేశారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే నీటిని విడుదల చేయాలని, నీటి సరఫరా పై స్పష్టమైన కార్యచరణ ప్రకటించాలని, డిండి ఆయకట్టు రైతులకు భరోసా కల్పించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు స్థానిక ఎమ్మెల్యే ను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి నాయకులు కేతావత్ లాలు నాయక్, నక్క వెంకటేష్ యాదవ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి ,అసెంబ్లీ కన్వీనర్ ఏ టీ కృష్ణ ,ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ జల్దా భాస్కర్ ,మాధవరం నరసింహారావు ,చెల్లెమల్ల ప్రవీణ్ కుమార్ ,కందుకూరు సర్పంచ్ బరపటి కొండల్, వావిళ్ళ అంజి యాదవ్, పున్న దినేష్, నాగమణి, అమృత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# బుధవారం గణేష్ నిమజ్జనం

## రాచర్ల తిమ్మాపూర్‌లో మండపాల నిర్వాహకుల నిర్ణయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 19 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో గణేష్ నిమజ్జనంపై గ్రామ సర్పంచ్ అందె సుభాష్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామంలోని వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు సమావేశానికి హాజరై నిమజ్జన కార్యక్రమంపై చర్చించారు. గ్రామంలో ప్రతిష్ఠించిన గణనాథులందరినీ బుధవారం ఒకే రోజు నిమజ్జనం చేయాలని నిర్వాహకులు, గ్రామ ప్రజలు చర్చించి నిర్ణయించారు. నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అందె సుభాష్ మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు. భక్తులు, మండపాల నిర్వాహకులు పరస్పరం సహకరించుకుంటూ నిమజ్జన వేడుకలను శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు.



# విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పేలిన సీటీ

## భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని 33/11 కేవీ ఓల్డ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కారణంగా సీటీ (కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్) పేలిపోయింది. దీంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఏఈ రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, లైన్‌మెన్ లక్ష్మీరాజ్యం తదితర సిబ్బంది వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టారు. కోరుట్లపేట విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి రివర్స్ విద్యుత్ సరఫరా అందించే ఏర్పాట్లు చేసి పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పేలిపోయిన సీటీని సరిచేసేందుకు సిరిసిల్లకు చెందిన ఎన్‌పీడీసీఎల్ ప్రొడక్షన్ టీమ్‌కు సమాచారం అందించినట్లు ఏఈ రాకేష్ రెడ్డి తెలిపారు. సాంకేతిక సిబ్బంది సాయంత్రంలోగా సీటీని మరమ్మతు చేసి సాధారణ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారీ వర్షం కారణంగా సాంకేతిక సమస్య తలెత్తినప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ మార్గంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో వినియోగదారులకు ఇబ్బందులు తగ్గాయి.

# బోరబండ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గణపతి హోమం, అన్నదానం

## గణనాథుడిని దర్శించుకున్న డా. వంగపల్లి అంజయ్యస్వామి



గజ్వేల్ అరుణ ప్రభ : మోతీనగర్--బోరబండ: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మోతీనగర్--బోరబండ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గణపతి హోమం, అన్నదాన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కైలాస శ్రీనివాస్ గుప్తా, పెద్ది శంకర్ గుప్తా తదితరుల ఆహ్వానం మేరకు ఐవీఎఫ్ రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ డా. వంగపల్లి అంజయ్య స్వామి కార్యక్రమానికి హాజరై గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు డా. వంగపల్లి అంజయ్య స్వామిని ఘనంగా సన్మానించి, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డా. వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గణపతి హోమం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంఘం సభ్యులకు అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ బోరబండ ఆర్య వైశ్య సంఘానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనుమలసేటి సత్యనారాయణ గుప్తా--సంగీత, కైలాస శ్రీనివాస్ గుప్తా--లక్ష్మీదేవి, కల్లూరి సురేష్ గుప్తా--సంగీత, బుస్సా కృష్ణమూర్తి గుప్తా--స్వప్న, రతకంటి సాయిబాబా గుప్తా--శివలక్ష్మి, కపర్తి లక్ష్మీనర్సయ్య గుప్తా--లలిత, పెద్ది శంకర్ గుప్తా--లక్ష్మి, కపర్తి సంతోష్ కుమార్ గుప్తా--వనిత పాల్గొన్నారు. అలాగే కందుకూరి లలిత (మహిళా సంఘం అధ్యక్షురాలు), రవీందర్ గుప్తా, మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి బుస్సా రూపశ్రీ, రవికుమార్ గుప్తా, మహిళా సంఘం కోశాధికారి దిడ్డిగం సునీత భవాని, సురేష్ కుమార్ గుప్తా, శ్రీ వాసవీ సొసైటీ చైర్మన్ ఎల్లూరి లక్ష్మీనారాయణ గుప్తా, మీనా తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

కరీంనగర్ అరుణప్రభ ప్రతినిధి, సెప్టెంబర్ 19: కరీంనగర్‌లోని స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈగల్ ఫోర్స్, కరీంనగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమానికి ఈగల్ ఫోర్స్ ఈస్ట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్. గిరిధర్ ఐపీఎస్, ఈగల్ ఫోర్స్ డీఎస్పీ ఎస్. ఉపేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎస్. ఉపేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన డ్రగ్ రహిత తెలంగాణ నవనిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు వాటి వల్ల కలిగే నష్టాలపై ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్య అతిథి ఆర్. గిరిధర్ ఐపీఎస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు, గురువులు, సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్రమశిక్షణ, మంచి ఆలోచనలు, బాధ్యతాయుత ప్రవర్తనతోనే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులతో అధికారులు ముచ్చటిస్తూ పలు ప్రశ్నలు అడిగారు. ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున నగదు బహుమతిని అందజేసి అభినందించారు.అనంతరం ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో రూపొందించిన యాంటీ డ్రగ్స్ పోస్టర్లను ఆర్. గిరిధర్ ఐపీఎస్ ఆవిష్కరించారు. డ్రగ్ రహిత




సమాజ నిర్మాణంలో తాము కూడా భాగస్వాములమవుతామని విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం అనంతరం కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఆర్. గిరిధర్ ఐపీఎస్‌ను శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ వి. విశ్వనాథ్ వినోద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్. సాయినాథ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్‌లో ఘనంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి గారి నివాసంలో ఆయన సోదరుడు, లిజిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి గారిలి జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకలకు లిరాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి గారిలి చేతుల మీదుగా కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు,మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్‌యూఐ (NSUI) బాధ్యులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో సదరం శిబిరాల నిర్వహణ



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి, సెప్టెంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగుల వైకల్య ధ్రువీకరణ కోసం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వివిధ విభా గాలకు సంబంధించి సదరం శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. ఆయా వైద్య విభాగాలకు సంబంధించిన వైద్యులు సూచించిన తేదీల ప్రకారం శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదరం శిబిరాల తేదీలు, విభాగాల వివరాలు ఇలా ఉన్నాయి: సెప్టెంబర్ 21: ఆర్థో – 100, కంటిచూపు – 20. సెప్టెంబర్ 23: వినికిడి – 75, జనరల్ – 50. సెప్టెంబర్ 24: వినికిడి – 75. సెప్టెంబర్ 28: కంటిచూపు – 20. సెప్టెంబర్ 29: మానసిక – 45. అక్టోబర్ 1: ఆర్థో – 105. అక్టోబర్ 3: మానసిక – 45, ఆర్థో – 105. అక్టోబర్ 5: ఆర్థో – 105. అక్టోబర్ 6: ఆర్థో – 105. అక్టోబర్ 8: కంటిచూపు – 20. అక్టోబర్ 15: కంటిచూపు – 20. అక్టోబర్ 22: కంటిచూపు – 20. అక్టోబర్ 26: కంటి చూపు – 20. సదరం శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులు తమ వెంట సంబంధిత వైద్య పత్రాలు, ఎక్స్‌రేలు, యూడీఐడీ దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఫోన్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచించారు. శిబిరం జరిగే రోజున ఉద యం 9 గంటలకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హాజరు కావాలని తెలిపారు. ఈ శిబిరాల సమాచారాన్ని మండల అభివృద్ధి అధికారులు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్ల ద్వారా ఆయా పరిధిలోని దివ్యాంగులకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# 22ఏ సమస్యలకు త్వరలో ముగింపు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్ :- రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు శాసనసభలో చేసిన ప్రకటన మేరకు త్వరలో ప్రజలకు తీపికబురు అందుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. దీనిలో భాగంగా అసెంబ్లీలో ప్రకటించిన 12 అంశాలపై దృష్టి సారించి దశల వారీగా వాటిని నెరవేరుస్తున్నామని ఈ మేరకు కాలనీల సమస్యపై జీవో 118, సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను విడుదల చేశామన్నారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్దీకరణకు సంబంధించి సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ధృవ పత్రాలను సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆలోచనల మేరకు ఈ క్యూర్ ప్రాంతాన్ని ప్రపంచంలోనే నెంబర్ 1 ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సమస్యల పరిష్కారానికి గాను ఆధార్ వలే భూధార్ కార్డులు ఇస్తామని, ఈ క్యూర్ ప్రాంతంలో కూడా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాల ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వలేమని తమకు ప్రజాసేవే ముఖ్యమని అన్నారు. ఇటీవల శాసనసభలో భూ సమస్యలపై సుదీర్ఘంగా చెప్పామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనలు, 12 అంశాల మేరకు ఈ సరూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న 64 కాలనీల్లోని 44 కాలనీల సమస్యను పరిష్కరించామని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలకు 118 జీఓ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన హామీని ఈరోజు నిలబెట్టుకున్నామన్నారు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ పార్టీవారు ప్రాతినిధ్యం వహిస్తున్నా తాము బేషజాలకు పోకుండా ఇక్కడి 44 కాలనీల సమస్యలపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులున్నా ఇప్పుడు వాటిని నెలరోజులలోగా పరిష్కరించి ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని, ఎవరి ఇళ్లుకూల్చదని స్పష్టం చేశారు. జీవో 118 సహకారంతో మేడ్చల్ , రంగారెడ్డి జిల్లాలోని మరికొంత మందికి కూడా నెలలోగా సమస్య పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ ప్రాంత



కాలనీలు చాలా కాలం నుంచి 22ఎలో ఉన్నాయని వివరిస్తూ 22ఎ కు సంబంధించి త్వరలో ఈ ప్రభుత్వం తీపి కబురు చెప్పనుందని తెలిపారు. 22ఎ అనేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి అమలులో ఉందని, దీనిని పరిశీలించుకోవచ్చునన్నారు. అయితే కొంతమంది దీనిని అసరాగా చేసుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మరో వారం రోజుల్లో సమస్య పరిష్కరించే విధంగా ప్రభుత్వ ఆదేశాలు రానున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ సమస్య, దరఖాస్తు చేసుకోని వారి సమస్యను పరిష్కరించేందుకు ఈ వేదికగా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు త్వరలో ఈ మేరకు శుభవార్త చెబుతారని ప్రకటించారు. సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను అమలు చేయబోతున్నామని దీనికోసం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మరో 45 రోజుల్లో పూర్తిస్థాయిలో భూసమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎల్. బి. నగర్, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు డి .సుధీర్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, ఎల్. బి. నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు

## మహిళలతో ఘనంగా సామూహిక కుంకుమార్చన

## ముఖ్య అతిథులుగా సీఐ రవికుమార్, వంటేరు ప్రతాపరెడ్డి

గజ్వేల్ అరుణ ప్రభ : గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు మస్కూరి వాడలో వీఐపీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు కాలనీ మహిళలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు మాట్లాడుతూ యువత దైవభక్తితో పాటు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని అన్నారు. యువత సన్మార్గంలో పయనిస్తూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. వీఐపీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడిని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆమె అభినందించారు. గణపతి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఐపీ యూత్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండ జిల్లా నీలగిరి మహిళా సమాఖ్య కార్యదర్శిగా ఎనమల్ల అనిత

అరుణ ప్రభ ,దిండి, సెప్టెంబర్ 19 శుక్రవారం నల్లగొండ జిల్లా మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎన్నికలలో ఈసీ మెంబర్లు పాల్గొని ఓట్లు వేయడం జరిగింది ఆ ఎన్నికల్లో దిండి మండలం తవకలాపూర్ గ్రామానికి చెందిన యనమల్ల అనిత కార్యదర్శిగా గెలుపొందిందని అధికారులు ప్రకటించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పిడి శేఖర్ రెడ్డి శాలువాతో అనితను సన్మానించారు.అనిత మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన ఈసీ మెంబర్లకి మరియు నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.మహిళా సంఘాల అభివృద్ధికి మరింత బలోపేతానికి నా వంతు కృషి చేస్తానని అన్నారు.



# దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్ సాంస్కృతిక చరిత్ర విభాగ అధ్యక్షుడిగా డాక్టర్ గోవిందు సురేంద్ర

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): 45వ దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్ మహాసభల్లో సాంస్కృతిక చరిత్ర విభాగానికి అధ్యక్షుడిగా ఎన్నికైన గూడూరు లోని ఎస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ గోవిందు సురేంద్రకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. నవంబర్ నెలలో తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో జరగనున్న 45వ దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్ మహాసభలకు సాంస్కృతిక చరిత్ర విభాగ అధ్యక్షుడిగా డాక్టర్ గోవిందు సురేంద్రకు ఆహ్వానం అందిన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ గోవిందు సురేంద్ర జిల్లాలోని పలు చారిత్రక అంశాలపై విశేష పరిశోధనలు చేస్తూ, విద్యార్థుల్లో చరిత్ర పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ చరిత్ర బోధనలో తన ప్రతిభను చాటుకుంటున్నారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఇప్పటికే అనేక పరిశోధనా వ్యాసాలను రచించి, చారిత్రక పరిశోధనా రంగానికి విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రాంప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. కిరణ్మయి, డాక్టర్ యశోద, డాక్టర్ కె. లావణ్య, వి.వి.రమణారెడ్డి, ఏ.వి ప్రసాద్, అధ్యాపకేతర సిబ్బంది వినయ్, గోపాల్, జనార్ధన్, శైలజ , సిబ్బంది అభినందించారు.

# అండర్-16 బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్లో ఉత్తమ ప్రతిభ కనబరచి "బెస్ట్ ప్లేయర్'గా కె ఎస్ దర్శన్



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో అమరావతి జూనియర్ కాలేజీ, శ్రీకాళహస్తి నందు ఎంపీసీ మొదట సంవత్సరం చదువుచున్న కె ఎస్ దర్శన్ అను విద్యార్థి, సెప్టెంబరు 11 వ తారీఖు నుండి 13 వ తేది వరకు ఒంగోలు జిల్లా మార్కాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–16 బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్లో ఉత్త బిబి మ ప్రతిభ కనబరచి "బెస్ట్ ప్లేయర్'గా ఎంపికయ్యారు అని కళాశాల కరస్పాండెంట్ డా. ప్రసూన పసుపులేటి తెలిపారు. అంతేగాక తన యొక్క ప్రతిభతో జాతీయ జట్టుకు కూడా ఎన్నికయ్యారని అధికారికంగా త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తామని, ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు తమ లక్ష్మీ నరసింహ ఛారిటబుల్ ఉస్ట్ ద్వారా ప్రోత్సాహకాలు అంద జేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ది.రాజేష్, కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో ఘనంగా 'సేవా సంకల్ప అభియాన్' సన్నాహక సమావేశం




అరుణప్రభ 19 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానిగా 25 ఏళ్ల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ పిలుపు మేరకు 'సేవా సంకల్ప అభియాన్' సన్నాహక సమావేశాన్ని జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం జిల్లా ఇన్చార్జ్ తక్కలపల్లి నిఖిల్ రావు హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవ, దేశాభివృద్ధి కోసం ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ఈ అభియాన్ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో మానుకోట బీజేపీ జిల్లా అధ్యక్షులు వల్లభ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కచ్వయల్ శ్యామ్ సుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమానికి బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దిడ్డి మహేష్ అధ్యక్షత వహించగా.. ప్రధాన కార్యదర్శులు భరత్, రమేష్, రిషి, లోకేష్, పవన్, చంద్రశేఖర్, నాగరాజు, శ్రీకాంత్, చంటి, బాబురావు, అశోక్, సురేష్ మరియు ఇతర బీజేవైఎం ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కష్టంతో కాదు ఇష్టంతో చదవాలి

## డాక్టర్ రియాజ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గ్రంథాలయ పరిషత్ చైర్మన్




అరుణప్రభ 19 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మహబూబాబాద్ లో ఈరోజు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థినులకు ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీ పొక్కుల సదానందం అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక అడ్మిషన్లు తో పాటు అత్యధిక ఫలితాలను కూడా సాధిస్తున్న ఏకైక బాలికల కళాశాలని కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో ప్రతిరోజు హాజరు కావడం వల్ల అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని తెలియజేస్తూ అధ్యాపక బృందం ప్రతిరోజు విద్యార్థులకు తరగతులు బోధిస్తూ, ఎంసెట్ క్లాసు బోధిస్తూ ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వారి లెసన్స్ ఐ ఎఫ్ ఎల్ ఫైనల్ ద్వారా బోధిస్తూ వారిని ఒక మంచి మార్గంలో పయనించే విధంగా దిక్సూచి చేస్తున్నారని ఈ సంవత్సరం కూడా ఫలితాల్లో ప్రథమ స్థాయిలో ర్యాంక్ సాధించే విధంగా కృషి చేస్తామని ఆ విధంగా విద్యా ప్రణాళికను రూపొందించుకొని ముందుకెళ్తున్నామని తెలియజేశారు .ఈ సంవత్సరం ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న అనేక సౌకర్యాలు సదుపాయాలు యూనిఫార్మ్స్ కాలేజ్ బ్యాగ్, షూ స్, టెక్స్ట్ బుక్స్, నోట్స్ బుక్స్ తో పాటు భవిష్యత్తులో అల్పాహారం అందించే అవకాశం ఉంది కాబట్టి ఈ అవకాశాలను అందిపుచ్చుకొని బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ గారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానికోసం ఇప్పటినుంచి కష్టంగా కష్టంతో కాకుండా ఇష్టంతోనే ప్రయత్నం చేసినట్లయితే కచ్చితంగా అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని ఇప్పటి యువత సెల్ ఫోన్ సెల్ ఫోన్ మత్తులో పడి విలువైన జ్ఞానాన్ని ఆర్జించే సమయాన్ని వృధా చేసుకుంటున్నారని సెల్ ఫోన్ జ్ఞానం కోసం వినియోగించుకోవాలని, విజేతలుగా నిలిచిన ప్రతి ఒక్కరూ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ధైర్యంగా ముందుకు సాగినవారని వారిని ఆదర్శంగా తీసుకొని వారు సూచించే సూచనలు ఆచరించి భవిష్యత్తు పొందాలని తెలియజేశారు లక్ష్యసాధనలో ఒకసారి అపజయం పొందినప్పుడు ఎట్టి పరిస్థితుల్లో కృంగిపోవద్దని, ధైర్యంతో ముందుకు దూసుకెల్లడమే విజయానికి సోపానమని, జీవితంలో ఆటుపోట్లు సహజమని వాటిని ఎదుర్కొని ముందుకెళ్లేవాడే విజేతగా నిలుస్తాడని అదేవిధంగా ఇంటర్మీడియట్ స్థాయి నుంచి మన సాధించాలనుకున్న లక్ష్యాన్ని ప్రణాళిక బద్ధంగా చదవాలని ఏ జాబ్ అయితే చేయాలని సంకల్పం చేసుకుంటాము ఆ ఉద్యోగం కోసం అవసరమైన విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను సలహాలు సూచనలు ఇచ్చే గురువులను తరచూ కలిసి అవసరమైన జ్ఞానాన్ని పొందాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ మదర్ గౌడు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను పొందడమే కాకుండా ఈ కళాశాలలో ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం ఒక క్రమశిక్షణమైన విద్య విలువలను కలిగి ఉండి విద్యార్థులకు అనునిత్యం అందుబాటులో ఉండటం వల్ల అడ్మిషన్లు కానీ ఫలితాలు కానీ చాలా ఉత్తమంగా ఉన్నాయని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడానికి కళాశాల ప్రిన్సిపాల్ సదానందం గారు చేస్తున్న కృషి అద్భుతమని విద్యార్థులందరూ ఈ కళాశాలలో చేరడం వారు చేసుకున్న అదృష్టమని అలాగే మంచిగా ఉన్నత స్థితిలో నిలవాలని సూచించారు అతిథిగా విచ్చేసిన డాక్టర్ పొక్కుల సంస్కృతి మాట్లాడుతూ గర్ల్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులందరూ కూడా ఉన్నత స్థాయిలో ఉండాలని, దానికోసం ఆడవాళ్ళం మనమేం చేస్తాం అని ఆలోచించకుండా, ఆడవాళ్ళం కాబట్టి ఏదైనా సాధించగలం అనే పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. మన నాన్న మన గురించి మాత్రమే ఆలోచిస్తారు కానీ కళాశాల ప్రిన్సిపాల్ గారు మాత్రం కళాశాలలో ఉండబడే అందరి ఆడపిల్లల గురించి ఆలోచిస్తారు కాబట్టి మీరు ధైర్యంగా ఈ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు కాబట్టి తల్లిదండ్రుల తర్వాత ఇక్కడి అధ్యాపకుల మంచి బోధనతో మీరు ఉత్తమ విద్యార్థులు తయారు కావాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ వివి నాగేందర్ పెండ్లి అశోక్ 11వ వార్డు కౌన్సిలర్ బోడ రవి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చొప్పరి శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకులు సాదిక్ అలీ, పర్వీన్ బేగం, రవికిరణ్, నవీన్ కుమార్,రియాజ్, స్వాతి, భార్గవి, కిరణ్, స్వరూప, సృజన, పూర్ణిమ, రవి భాగ్యలక్ష్మి లక్ష్మీ ఉమా అక్షర ప్రభాకర్ నవోదయ వెంకన్న మహమ్మద్ భాష జానీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినిల సాంస్కృతి కార్యక్రమాలు చాలా ఉత్సవ భరీతంగా, ఆహ్లాదకరంగా అందరినీ ఆకట్టుకోవడం జరిగింది.

# నూతన న్యాయస్థాన భవనం ప్రారంభం





అరుణప్రభ 19 సెప్టెంబర్ మహబూబాబాద్ : శనివారం మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు భవనం ప్రారంభించిన గౌరవ హైకోర్టు జడ్జ్ జస్టిస్ శ్రీ ఈవి వేణుగోపాల్, జస్టిస్ శ్రీ ఎన్. రాజేశ్వరరావు, జస్టిస్ శ్రీ బిఆర్. మధుసూదనరావు,

### మరిపెడలో నూతన న్యాయస్థానం ప్రారంభం

బార్--బెంచ్ సమన్వయంతో ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించాలి: గౌరవనీయ న్యాయమూర్తి మరిపెడలో నూతన న్యాయస్థానం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ ఈవి వేణుగోపాల్ మాట్లాడుతూ, న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి బార్ మరియు బెంచ్ మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కోర్టులో వాదనలు వినిపించే ప్రతి న్యాయవాది ఆఫీసర్ అఫ్ ది కోర్ట్ గా వ్యవహరిస్తూ, న్యాయస్థానానికి సహకరించాలని, చట్టపరమైన అంశాలను సమగ్రంగా కోర్టు ముందుంచాలని సూచించారు. న్యాయమూర్తులు ప్రతి కేసును ఎంతో శ్రద్ధగా పరిశీలించి, చట్టపరమైన అంశాలను అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. న్యాయవాదులు కూడా న్యాయస్థాన నిర్ణయాలను విస్తృత దృక్పథంతో అర్థం చేసుకోవాలని సూచించారు. తాను న్యాయవాదిగా ఉన్న సమయంలో ఎదుర్కొన్న ఒక కేసు అనుభవాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కోర్టు ఇచ్చిన నిర్ణయాన్ని అనంతరం పూర్తిగా అధ్యయనం చేయడం ద్వారా, తాను వాదనలో ప్రస్తావించలేకపోయిన ముఖ్యమైన అంశాన్ని గుర్తించానని తెలిపారు. ఈ అనుభవం ద్వారా న్యాయవ్యవస్థలో నిరంతర అధ్యయనం, ఆత్మపరిశీలన ఎంత ముఖ్యమో వివరించారు.

### రాజ్యాంగ హక్కులు ప్రతి ఒక్కరికీ అందాలి

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కులు, న్యాయపరమైన రక్షణలు అందరికీ సమానంగా అందేలా చూడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థ, బార్, కార్యనిర్వాహక వ్యవస్థతో పాటు ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 మరియు ఆర్టికల్ 51ఎలోని స్ఫూర్తిని ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని బలహీన వర్గాలు, ఆశ్రయ గృహాల్లో ఉన్న పిల్లలు మరియు ఇతర అవసరమైన వారికి చట్టపరమైన రక్షణ, సంక్షేమ సేవలు అందేలా న్యాయవ్యవస్థ మరియు కార్యనిర్వాహక వ్యవస్థ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### న్యాయస్థాన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం

న్యాయవ్యవస్థపై పెరుగుతున్న పని భారాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన కోర్టు భవనాలు, సిబ్బంది, సాంకేతిక సదుపాయాలు మరియు ఇతర మౌలిక వసతులు అవసరమని గౌరవనీయ న్యాయమూర్తి పేర్కొన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో కొత్త జిల్లాలకు తగిన న్యాయస్థాన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన సహకారం అందించాలని కోరారు.

### మహబూబాబాద్ జిల్లా కోర్టు భవనానికి త్వరలో శంకుస్థాపన

వరంగల్ జిల్లా నుంచి విడిపోయి ఏర్పడిన మహబూబాబాద్ జిల్లాకు పూర్తిస్థాయి జిల్లా కోర్టు భవనం అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు భవనానికి త్వరలోనే గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు, న్యాయవ్యవస్థకు చెందిన అధికారులు మరియు ఇతర సంబంధిత విభాగాల సమన్వయం అవసరమని అన్నారు.

### జిల్లా కలెక్టర్ కృషికి అభినందనలు

జిల్లా కలెక్టర్ గారు న్యాయస్థాన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం పట్ల చూపుతున్న నిబద్ధతను గౌరవనీయ న్యాయమూర్తి అభినందించారు. ఇటీవల ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా కూడా ఆమె కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. మరిపెడ న్యాయస్థాన ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు అధికారులు, పిడిజె శ్రీ మురళీ మోహన్, ఇతర న్యాయమూర్తులు, న్యాయస్థాన సిబ్బంది, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు మరియు సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరిపెడ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రత్యేకంగా అభినందించారు

బార్--బెంచ్ సమన్వయంతో మరిపెడ న్యాయస్థానం ప్రజలకు సత్వర, సమర్థవంతమైన న్యాయం అందించే కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు

గౌరవ న్యాయమూర్తులు శ్రీ ఎన్. రాజేశ్వర్ రావు, గౌరవ శ్రీ బిఆర్. మధుసూదనరావు, మాట్లాడుతూ జిల్లాలో కోర్టు భవనం ప్రారంభించడం సంతోషం కలిగించిందని, ప్రతీ ఒక్కరికీ తక్షణమే న్యాయ సేవలు అందించాలని సూచించారు, జిల్లాలో చరిత్రాత్మకమైన మరిపెడ లో కోర్టు ఆవిష్కృత , ప్రాముఖ్యత గురించి మాట్లాడారు, స్వంత జిల్లాలో ఉన్న అనుభవాలు గుర్తుకు చేసారు. అంతకు ముందు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో గౌరవ న్యాయమూర్తులకు ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, స్వాగతం పలికి మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందచేశారు ఈ కార్యక్రమంలో గౌరవ ప్రిన్సిపల్, సీనియర్, జూనియర్, జడ్జిలు శ్రీ డికె మురళీమోహన్, శాలిని షాకెల్లి, స్వాతి మురారి, కృష్ణతేజ్, ధీరజ్ కుమార్, జీవన్ కుమార్, మహతి వైష్ణవి, అఖిల, దిలీప్ కుమార్ నాయక్, సూర్య చంద్రకళ, క్యాన్ లాల్, చండే శరీ దేవి, జ్యోత్స్న, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, సంబంధిత జిల్లాలబార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.



## గణపతి మండపాలను సందర్శించిన సింగిరెడ్డి పద్మారెడ్డి

## ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద పంపిణీ

సెప్టెంబర్ 19, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదవ రోజు గణపతి ఉత్సవాల్లో భాగంగా చెంగిచెర్ల ఓల్డ్ విలేజ్లో, మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్ నాయక మండపాన్ని, మరియు ఎన్ఐఎన్ కాలనీలో జరిగిన వినాయక ఉత్సవాలలో మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మ కళ్యాణ్ , చెంగిచెర్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులతో కలిసి సింగిరెడ్డి పద్మా రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా భీమ్ రెడ్డి నగర్ రోడ్ నెంబర్ 04 లో నిర్వహిస్తున్న వినాయక మండపాన్ని సందర్శించిన సింగిరెడ్డి గణనాధుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండప నిర్వాహకులు నిర్వహించిన అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. శ్రీ విఘ్నేశ్వరుని కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటూ ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహిస్తున్న మండప నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌లకు సన్మానం చేసిన



## మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి గారు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం సభ్యులకు ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ... జర్నలిస్ట్ లు ప్రజా సమస్యలను వెలికితీసి పరిష్కారం చూపేవిధంగా పనిచేయాలనీ . గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు ఇచ్చి తగిన గౌరవం ఇచ్చిన పార్టీ బిఆర్ ఎస్ అన్నారు. సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్. ఈసీ సభ్యులు. హసీబ్ పాటిల్. నియోజకవర్గ అధ్యక్షులు సత్యం. ప్రధాన కార్యదర్శి. ఎలక్ట్రానిక్ మీడియా నియోజవర్గ అధ్యక్షుడు బి రాములు. భూమయ్య. ఉపాధ్యకులు. జి .విఠల్. బిరాదర్ సంగప్ప. మూడ అశోక్ కుమార్. ఎలక్ట్రానిక్ మీడియా జాయింట్ సెక్రటరీ. అంబదాస్. ఆర్గనైజింగ్ సెక్రటరీ విరా రెడ్డి. నాయకులు. మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం,మనూర్ మండల పార్టీ అధ్యక్షులు విట్టాలరావు పటేల్, కౌన్సిలర్ విజయ బుజ్జి, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, మాజీ ఎంపీటీసీ ముజామిల్ మాజీ కోఆప్షన్ సభ్యులు సలీం తదితరులు పాల్గొన్నారు.



## మైత్రి హాస్పిటల్‌లో ఘనంగా అన్నప్రసాద వితరణ

## ::: మైత్రిలో ఉత్సాహంగా ముగిసిన నిమజ్జన వేడుక

అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్ 19 : గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మైత్రి హాస్పిటల్ డాక్టర్ బాలు నాయక సుచిత్ర ఆధ్వర్యంలో వినాయక విగ్రహానికి గత ఐదు రోజులుగా పూజలు నిర్వహించి అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నప్రసాదాన్ని భక్తులకు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు నాయక్ సుచిత్ర మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు మట్టి గణపతిని ఏర్పాటుచేసి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ పర్యావరణం కాపాడాలని వారు తెలిపారు ప్రతి సంవత్సరం మైత్రి హాస్పిటల్ నందు మట్టి వినాయకుని ఏర్పాటు చేసి మహబూబాబాద్ ప్రజలు సుఖశాంతాలతో సుఖ సంతోషాలతో ఉండాలని పూజ చేస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరన్న ,డాక్టర్ కుమార్ స్వామి,, డాక్టర్ రమేష్, డాక్టర్ జగన్మోహన్ రెడ్డి,, డాక్టర్ రాంరెడ్డి,మరియు మైత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## కర్నూలు ఆత్మీయ సమావేశానికి తరలిరండి: వీహెచ్‌పీ నేతల పిలుపు

ధర్మవరం, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) : అశోక్ సింఘాల్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా అక్టోబర్ 4న కర్నూలులో నిర్వహించనున్న ప్రాంత స్థాయి కుల పెద్దల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ శ్రీ సత్య సాయి జిల్లా ఉపాధ్యక్షులు వెంగముని కోరారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. సమావేశానికి కుల పెద్దలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విభాగ కార్యదర్శి పులిచర్ల వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి నరేంద్రకుమార్, దేవరకొండ రామానుజులు, నరసింహారెడ్డి, శేషాద్రి, తిరుపతయ్య, కండే విశ్వనాథ్, బీరే శ్రీనివాసులు, జల్లా రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ భూకబ్జాల లెక్కల్లాగే ఇబ్రహీంపట్నంలో దోపిడీని బయటపెడతాం

### బీఆర్ఎస్ నేతలు కబ్జా చేసిన ప్రతి గుంటను పేదలకు పంచుతాం

### అంబేడ్కర్ చౌరస్తాలో అభివృద్ధి నిధులపై చర్చకు రావాలి: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం:అరుణ ప్రభ.ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గతంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూకబ్జాలు, భూదోపిడీ వ్యవహారాలపై పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకువస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో గత పాలనకు సంబంధించిన భూ వ్యవహారాలను ప్రజల ముందుకు తీసుకువస్తున్న తరహాలోనే, ఇబ్రహీంపట్నంలోనూ భూకబ్జాలకు సంబంధించిన వివరాలను బయటపెడతామని ఆయన పేర్కొన్నారు. భూకబ్జాలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కబ్జాకు గురైనట్లు గుర్తించిన భూముల వివరాలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఇంకా ఆక్రమణలకు గురైన భూముల వివరాలను సేకరించి ప్రజల ముందుంచుతామని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు ఉన్న భూముల్లో నిజానిజాలను పరిశీలించి, ప్రభుత్వ భూములు లేదా పేదల భూములు అక్రమంగా ఆక్రమించబడినట్లు తేలితే వాటిని అర్హులైన పేదలకు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

**అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే కొందరు వాటిని ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. “బట్టకాల్చి మీదేసేలా కొందరి తీరు ఉంది. ప్రజల కోసం మాత్రం ఓపికతో పనిచేస్తున్నాం” అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, నియోజకవర్గానికి తీసుకువచ్చిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో తన పార్టీ నాయకులతో కలిసి చర్చకు రావాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. రాబోయే కాలంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తనకు ముఖ్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.

---



## భక్తిశ్రద్ధలతో 4వ రోజు పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడు

### విఘ్నాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించు బొజ్జ గణపయ్యా

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో: శనివారం 19.9.2026 నాడు వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర స్వామివారికి 6 వ రోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పార్చనలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గణనాథునికి విశేష పూజలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో పూజల్లో పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడు తమ జీవితాల్లోని విఘ్నాలను తొలగించి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం ప్రసాదించాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో యువత పాల్గొనడం అభినందనీయం

### రుద్రాన్ష్ యువసేన ఆధ్వర్యంలో భక్తి పార్వషంతో కొనసాగుతున్న వేడుకలు

### యువకుల ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని అభినందిస్తున్న భక్తులు

అరుణప్రభ 19 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముందుండాలని సనాతన ధర్మాన్ని పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రుద్రాన్ష్ యువసేన కమిటీ వారు నిరూపించారు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక సూర్య టాకీస్ లైన్ లో ప్ర ప్రథమంగా యువకులంతా కలిసి గణేష్ నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ భక్రి పారవశ్యంలో మునిగి తేలుతున్నారు ఈ సందర్భంగా పలువురు పెద్దలు యువకుల ఆధ్యాత్మిక ప్రయత్నాన్ని అభినందిస్తున్నారు ప్రతిరోజు కళాశాలలో చదువులో నిమగ్నమైన వారు ఇలా గణేష్ ఉత్సవాలు చేయడం సంతోషకరమని ఇది వారి భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడుతుందని అందరి పైన వినాయకుని ఆశీస్సులు ఉండాలని వారి తల్లిదండ్రులు అన్నారు.



## పోలీస్ నియామకాలపై ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు న్యాయం చేయాలని వినతి

పోలీస్ నియామకాల ప్రిలిమినరీ పరీక్షల్లో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు సంబంధించిన కటాఫ్ మార్కులను తగ్గించాలని, అలాగే ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు నియామక ప్రక్రియలో న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెడ్డి సంఘం నాయకులు ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు, గౌరవ రాజ్యసభ సభ్యులు శ్రీ వేమ్ నరేందర్ రెడ్డిని కలిసి సమస్యను వివరించి, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రెడ్డి సంఘం అధ్యక్షులు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘ నాయకులు పాల్గొని, అభ్యర్థుల సమస్యలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పిస్తూ, పారదర్శక నియామక ప్రక్రియను కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## వర్షిత మృతికి పాఠశాలలో సంతాపం

### పాఠశాలకు సెలవు ప్రకటించిన హెచ్‌ఎం జానకి



ధర్మవరం, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) : కదిరిగేటు వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన శాంతినగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి విద్యార్థిని ఆర్.వర్షిత మృతికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. ఎంఈఓలు రాజేశ్వరిదేవి, గోపాల్‌నాయక్ ఆదేశాల మేరకు శనివారం పాఠశాలకు సెలవు ప్రకటించినట్లు హెచ్‌ఎం జానకి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వర్షిత మృతదేహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. వర్షిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిమజ్జనాలు, ఊరేగింపులు, రద్దీ ప్రాంతాలకు పిల్లలను ఒంటరిగా పంపవద్దని హెచ్‌ఎం సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

---

# ఇబ్రహీంపట్నంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న శ్రీనివాస కల్యాణోత్సవం

**శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**గణనాథుడికి ప్రత్యేక పూజలు.. ప్రజల సుఖసంతోషాల కోసం స్వామివారిని వేడుకున్న ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగా రెడ్డి.**







ఇబ్రహీంపట్నం: అరుణ ప్రభ. సెప్టెంబర్ 19.శ్రీ వేంకటేశ్వరస్వామివారి కృపాకటాక్షాలతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నంలో జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణేశ్ మండపాన్ని సందర్శించిన ఆయన, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల శ్రీవారి ఆలయ సంప్రదాయాలను అనుసరిస్తూ వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్వామివారి సేవలో కొద్దిసేపు భక్తిశ్రద్ధలతో గడిపిన ఆయన, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించిన జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అభినందించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాదిగా పత్తి విష్ణువర్ధనరెడ్డి

### ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గర్వకారణం

### న్యాయరంగంలో మరో అరుదైన ఘనత



సాధారణ రైతు కుటుంబంలో జన్మించి, స్వీయ కృషి, క్రమశిక్షణ, పట్టుదల, నిబద్ధత, న్యాయపట్ల అంకితభావంతో న్యాయవాద వృత్తిలో అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకున్న శ్రీ పత్తి విష్ణువర్ధన రెడ్డి గారిని తెలంగాణ హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాదిగా అధికారికంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, తెలంగాణ న్యాయవాద సమాజానికి గర్వకారణమైన విషయం. దాదాపు 28 సంవత్సరాల సుదీర్ఘ న్యాయవాద అనుభవం కలిగిన పత్తి విష్ణువర్ధన రెడ్డి గారు హైకోర్టు నుంచి జిల్లా న్యాయస్థానాల వరకు నిరంతరం న్యాయ సేవలు అందిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు. తన ప్రతిభ, న్యాయపరిజ్ఞానం, నిజాయితీ, వృత్తిపట్ల నిబద్ధతతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ హైకోర్టుకు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా ఉన్నతమైన బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం దేశ భద్రతకు, జాతీయ ప్రాధాన్యతకు సంబంధించిన కీలక కేసుల దర్యాప్తు చేసే జాతీయ దర్యాప్తు సంస్థ (N.I.A) తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించి న్యాయరంగంలో విశిష్టమైన గుర్తింపు పొందారు.

**న్యాయవాదుల హక్కులు, సంక్షేమం కోసం విశేష కృషి**

పత్తి విష్ణువర్ధన రెడ్డి గారి న్యాయ ప్రస్థానం కేవలం కోర్టు వాదనలే కాకుండా న్యాయవాదుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం కూడా ఆయన విశేషంగా కృషి చేశారు. బార్ కౌన్సిల్ అఫ్ ఇండియా మెంబర్ గా , అలాగే నియమాల కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ న్యాయవాదుల సమస్యలు, హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అనేక అంశాల్లో చురుకైన పాత్ర పోషించారు. అదేవిధంగా దేశంలోని ప్రతిష్టాత్మక న్యాయ విద్యాసంస్థలైన నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం తదితర జాతీయ న్యాయ విద్యాసంస్థల విద్యా సంబంధిత కార్యకలాపాల్లో భాగస్వామిగా సేవలందించారు.

**డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది హోదా -- విశిష్టమైన గౌరవం**

డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందడం సాధారణమైన హోదా కాదు. ఒక న్యాయవాది యొక్క సుదీర్ఘ వృత్తి అనుభవం, న్యాయపరిజ్ఞానం, వాదనా సామర్థ్యం, వృత్తిపరమైన ప్రతిష్ఠ, నైతిక విలువలు, న్యాయరంగానికి చేసిన సేవలు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని అందించే ప్రత్యేకమైన గౌరవం. శ్రీ పత్తి విష్ణువర్ధన రెడ్డి గారు కూడా నిర్దేశిత ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇంటర్వ్యూకు హాజరై, సంబంధిత కమిటీ పరిశీలనకు లోనై, కమిటీ సంతృప్తి మరియు తదుపరి హైకోర్టు ఆమోద ప్రక్రియ అనంతరం డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందడం ఆయన దాదాపు మూడు దశాబ్దాల న్యాయ ప్రస్థానానికి లభించిన అరుదైన గౌరవంగా చెప్పవచ్చు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఒక వ్యక్తి తన స్వీయ కృషిని బలంగా, క్రమశిక్షణను ఆయుధంగా, పట్టుదలను మార్గదర్శకంగా, న్యాయపట్ల నిబద్ధతను తన స్ఫూర్తిగా చేసుకుని దాదాపు మూడు దశాబ్దాల న్యాయ ప్రస్థానంలో ఇంతటి ఉన్నతమైన గుర్తింపును సాధించడం నిజంగా స్ఫూర్తిదాయకం. ఇది కేవలం శ్రీ పత్తి విష్ణువర్ధన రెడ్డి గారి వ్యక్తిగత విజయమే కాదు --- ఆయన పుట్టి పెరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, తెలంగాణ న్యాయవాద సమాజానికి గర్వకారణమైన ఘట్టం. భవిష్యత్తులో ఆయన తన అపారమైన న్యాయ అనుభవాన్ని న్యాయ పరిరక్షణ, సామాజిక న్యాయం, న్యాయవాదుల సంక్షేమం, యువ న్యాయవాదులకు మార్గదర్శకత్వం మరియు సమాజ ప్రయోజనానికి సంబంధించిన న్యాయపరమైన అంశాల కోసం మరింత విస్తృతంగా వినియోగించాలని ఆకాంక్షిద్దాం.తెలంగాణ హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందిన శ్రీ పత్తి విష్ణువర్ధన రెడ్డి గారికి హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు.

**ఆయన న్యాయపరిజ్ఞానం మరింత మందికి మార్గదర్శకంగా నిలవాలి...**

**ఆయన అనుభవం సమాజానికి మరింత ఉపయోగపడాలి...**

**న్యాయ సేవలో ఆయన ప్రస్థానం మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి...**

“స్వీయ కృషితో సాధించిన స్థానం --- న్యాయ సేవతో పొందిన గౌరవం --- సమాజ సేవతో సార్థకం చేసుకునే స్ఫూర్తిదాయక ప్రస్థానం.” శ్రీ పత్తి విష్ణువర్ధన రెడ్డి గారికి మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు.

# ఇద్దరితోనే కథ ముగుస్తుందా?

## నేతన్న సేవ పథకంపైనా విచారణ ఉంటుందా?


అరుణ ప్రభ

నేతన్న సేవలో ఆరోపణలు..
ఇప్పుడు చేనేత పింఛన్ల వంతా?

కూటమి నేతల మౌనం..

చేనేత జౌళి శాఖ అధికారుల తీరుపై అనుమానాలు

ఇంతలోనే చేనేత పింఛన్లపై మరో వివాదం

రాత్రి 9 గంటల వరకు సచివాలయంలోనే బైఠాయింపు

అమరావతి, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) చేనేత పింఛన్ల వెరిఫికేషన్‌లో అక్రమాలపై అరుణ ప్రభ న్యూస్ ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. పలు జిల్లాల్లో పింఛన్ల పరిశీలనలో అవకతవకలపై చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. స్పెషల్ సీఎస్ ఆర్.పీ. సిసోడియా, అన్ని జిల్లాల ఏడీలు సమీక్షలో పాల్గొన్నారు. పింఛన్ల పరిశీలనలో అక్రమాలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఇద్దరిపై చర్యలు**

మంత్రి ఆదేశాల మేరకు శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఉద్యోగులు రమణారెడ్డి, శీనా నాయక్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పింఛన్ల వెరిఫికేషన్‌లో అక్రమాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

**ఆందోళనకు స్పందన**

ధర్మవరం 23వ వార్డు సచివాలయం వద్ద చేనేత పింఛన్ల వెరిఫికేషన్‌పై చేనేత కార్మికులు శుక్రవారం రాత్రి వరకు ఆందోళన చేపట్టారు. అనర్హులకు పింఛన్లు అందేలా సిఫార్సులు ఎలా జరిగాయంటూ వారు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై అరుణ ప్రభ న్యూస్ కథనం ప్రచురించిన మరుసటి రోజే శాఖాపరంగా చర్యలు వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

**నేతన్న సేవ అవకతవకలపైనా విచారణ ఉంటుందా?**

ఇద్దరు ఉద్యోగులపై చర్యలతోనే వ్యవహారం ముగుస్తుందా? నేతన్న సేవ పథకంలో లబ్ధిదారుల ఎంపిక, అర్హతల పరిశీలన, ప్రయోజనాల పంపిణీపై వచ్చిన ఆరోపణలను కూడా ప్రభుత్వం సమగ్రంగా పరిశీలిస్తుందా? అన్నది ఇప్పుడు చేనేత వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పింఛన్ల వ్యవహారంలో తీసుకున్న చర్యల తరహాలోనే నేతన్న సేవ పథకంపైనా ఫిర్యాదులు, ఆరోపణలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

# కేబుల్ టీవీ రంగ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం

## శాసనసభలో సీపీఐ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు



హైదరాబాద్:సెప్టెంబర్19 తెలంగాణలోని కేబుల్ టీవీ రంగానికి, అందులో పనిచేస్తున్న జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడానికి కేబుల్ టీవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బి నరసింహ చారి ,పుదుల వెంకట్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సు విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యాజమాన్యాలు, సిబ్బంది ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సదస్సులో నాయకులు, ప్రముఖ జర్నలిస్టులు మాట్లాడుతూ తమ మద్దతు తెలిపారు. శాసనసభలో సీపీఐ పక్ష1నాయకులు కూనంనేని సాంబశివరావు గారు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సాంబశివరావు గారు మాట్లాడుతూ కేబుల్ టీవీ యాజమాన్యాలు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి గారి దృష్టికి అలాగే సంబంధిత మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో జిల్లాకు నాలుగు అక్రిడేషన్ కార్డులు ఇస్తే, ఈ ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదనే అంశంపై పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి, అవసరమైతే అసెంబ్లీలో కూడా దీనిపై మాట్లాడతానని ఆయన స్పష్టం చేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన టీయూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు,రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఖాజా విరాత్ అలీ గారు మాట్లాడుతూ కేబుల్ టీవీ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు దక్కేలా నా వంతుగా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ సదస్సుకు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి గారు, ముఖ్యవక్త ఆనంచిన్ని వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ.. కేబుల్ టీవీ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని,జిల్లా కేంద్రాల్లో 4,హైదరాబాద్ లో12 అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ డిమాండ్ చేశారు. సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న కేబుల్ టీవీ చానల్స్ అంటే ఈ ప్రభుత్వానికి ఎందుకు ఇంత చిన్నచూపు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేబుల్ టీవీ ఛానళ్ల యాజమాన్యాలు, సీఈఓలు, వివిధ జిల్లాల నుండి వచ్చిన జర్నలిస్టులు, సాంకేతిక సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తమకు జరుగుతున్న అన్యాయాలపై అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని తీర్మానించారు. కేబుల్ టీవీలను వెంటనే ప్రభుత్వ ప్రకటనల కోసం ఎంప్యానల్ చేయాలని, జిల్లా అక్రిడిటేషన్ కమిటీల్లో కేబుల్ టీవీ ప్రతినిధులకు చోటు కల్పించాలని సదస్సు ద్వారా ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేబుల్ టీవీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేతన్న సేవ, పింఛన్లలో అవకతవకలపై సీపీఐ ఆగ్రహం
## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి -ముసుగు మధు

ధర్మవరం, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) : నేతన్న సేవ, చేనేత పింఛన్లలో అర్హులైన కార్మికులకు అన్యాయం జరుగుతోందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు ఆరోపించారు. శనివారం మార్కెట్‌యార్డులోని చేనేత, జౌళి శాఖ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. నేతన్న సేవ పథకంలో అర్హులైన పలువురికి ఇప్పటికీ నగదు జమ కాలేదని, పింఛన్ల వెరిఫికేషన్‌లోనూ అవకతవకలపై ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏడీ అప్పాజీ, రమణారెడ్డి, శీనా నాయక్‌లపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ఎర్రంశెట్టి రమణతో పాటు పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.





## దాడిలో గాయపడిన
## టీడీపీ నాయకుడికి హరీష్‌బాబు పరామర్శ
### ::: మంత్రి సత్యకుమార్ ఫోన్‌లో పరామర్శ

ధర్మవరం, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) : బత్తలపల్లి మండలం తంబాపురానికి చెందిన టీడీపీ నాయకుడు ఆదినారాయణరెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు శనివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన దాడిలో గాయపడిన ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎన్డీఏ ప్రభుత్వం అండగా ఉంటుందని హరీష్‌బాబు భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో ఆదినారాయణరెడ్డి, కుటుంబ సభ్యులు ఫోన్‌లో మాట్లాడారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి తెలిపారు.

## రీసర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు
### అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఆర్డీఓ రామ భూపాల్‌రెడ్డి



ధర్మవరం, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం డివిజన్‌లో కొనసాగుతున్న రీసర్వే పనులను ఆర్డీఓ రామ భూపాల్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూకొలతలు, జాయింట్ ఎల్‌పీఎంల విభజన, రికార్డుల పరిశీలనపై అధికారులతో సమీక్షించారు. జాయింట్ ఎల్‌పీఎంల విభజనలో పట్టాదారుల హక్కులు, భూమి విస్తీర్ణం, క్షేత్రస్థాయి పరిస్థితులు, రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా రీసర్వే పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు, గ్రామస్థులు తమ భూములకు సంబంధించిన అభ్యంతరాలను సర్వే సిబ్బంది దృష్టికి తీసుకురావాలని ఆర్డీఓ కోరారు.



## వర్షిత కుటుంబానికి పరిటాల శ్రీరామ్ ఆర్థిక సాయం

ధర్మవరం, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) వినాయక నిమజ్జనం సందర్భంగా కదిరి గేటు వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన చిన్నారి వర్షిత కుటుంబాన్ని టీడీపీ నాయకులు పరామర్శించారు. పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో వర్షిత పార్థివదేహానికి నివాళులర్పించారు. పండుగ రోజున పేద కుటుంబంలో విషాదం చోటుచేసుకోవడం బాధాకరమని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని పరామర్శించారు. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అందించిన రూ.30 వేల ఆర్థిక సాయాన్ని వర్షిత తండ్రి అశోక్‌కు టీడీపీ నాయకులు అందజేశారు.౦



## ప్రశాంతంగా గణపతి నిమజ్జనం
### ::: ఏర్పాట్లను పర్యవేక్షించిన హరీష్‌బాబు

ధర్మవరం, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలో శనివారం గణపతి నిమజ్జనం భక్తిశ్రద్ధల మధ్య ప్రశాంతంగా జరిగింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు నిమజ్జన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. నిమజ్జన ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, అధికారుల సమన్వయం, భక్తులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విగ్రహాల నిమజ్జనం సజావుగా జరిగేందుకు ఏర్పాటు చేసిన రెండు భారీ క్రేన్ల పనితీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేశారని హరీష్‌బాబు తెలిపారు. నిమజ్జన కార్యక్రమానికి సహకరించిన భక్తులు, ప్రజలు, పోలీసు, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



## వర్షిత కుటుంబానికి ప్రభుత్వం అండ
### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం- హరీష్‌బాబు

ధర్మవరం, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) : కదిరి గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తొమ్మిదేళ్ల వర్షిత కుటుంబాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## పరిశుభ్రతతోనే ఆరోగ్యం
### విద్యార్థులు
### బాధ్యతగా ఉండాలి: ప్రిన్సిపాల్ సుందరేశ్వరరావు

ధర్మవరం, సెప్టెంబరు 19; (అరుణ ప్రభ న్యూస్) : కె.హెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. కె. సుందరేశ్వరరావు అధ్యక్షతన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల పరిసరాలను శుభ్రం చేసి, చెత్తను తొలగించి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ. ఆదినారాయణ, అధ్యాపకులు డా. హరిప్రసాద్, మహీధర్‌రావు, బి. ఆనంద్, ఏ. సౌజన్యలక్ష్మి, ఎస్. ఒబులపతి తదితరులు పాల్గొన్నారు.

# బాలంరాయిలో ఘనంగా వినాయక పూజలు

## వినాయకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ముప్పిడి గోపాల్

బాలంరాయి: బాలంరాయిలో సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి పూజా కార్యక్రమాల్లో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్ పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ముప్పిడి గోపాల్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి.ఎల్. ప్రమోద్ కుమార్, ఎన్.ఎస్. నిత్యానందరాజు, పరమేష్, విజయలక్ష్మి తో పాటు స్థానికులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



## రోజూ పరగడుపున పసుపు నీళ్లు తాగుతున్నారా? ఇలా చేస్తే ఏం జరుగుతుందో తెలుసా?

రోజూ పరగడుపున పసుపు నీళ్లు తాగుతున్నారా? ఆరోగ్యానికి మంచిదని భావించే ఈ అలవాటు కొందరిలో కిడ్నీ స్టోన్స్, అసిడిటీ, రక్తస్రావం వంటి సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంది.. పూర్తి వివరాలు తెలుసుకోండి. పసుపు మన భారతీయ వంటకాల్లోనే కాకుండా ఆయుర్వేదంలోనూ ఎంతో ప్రాధాన్యత కలిగిన పదార్థం. ఇందులో ఉండే 'కర్క్యుమిన్' అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాల వల్ల ఉదయాన్నే గోరువెచ్చని పసుపు నీళ్లు తాగడం చాలామంది రోజువారీ అలవాటుగా మార్చుకున్నారు. రోగనిరోధక శక్తి పెంచడానికి, చర్మ కాంతికి, జీర్ణక్రియ మెరుగుపడటానికి ఇది సహాయపడుతుందని నమ్ముతారు. అయితే, ఏదైనా పరిమితికి మించి తీసుకుంటే ప్రమాదకరంగా మారుతుంది. పసుపును ప్రతిరోజూ అధిక మోతాదులో ద్రవరూపంలో తీసుకోవడం వల్ల శరీరంపై కొన్ని తీవ్రమైన దుష్ప్రభావాలు పడే అవకాశం ఉంది. రోజూ పసుపు నీళ్లు తాగడం వల్ల వచ్చే ఆ దాగి ఉన్న ఆరోగ్య సమస్యల పూర్తి వివరాలు ఇప్పుడు క్లియర్ గా తెలుసుకుందాం. పసుపులో 'ఆక్సలేట్లు' పరిమాణం చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రతిరోజూ పసుపు నీళ్లను అధికంగా తీసుకోవడం వల్ల ఈ ఆక్సలేట్లు మూత్రంలోని క్యాల్షియంతో కలిసి 'క్యాల్షియం ఆక్సలేట్ కిడ్నీ స్టోన్స్' గా మారే ప్రమాదం ఉంది.



# వడ మధ్యలో రంధ్రం ఎందుకు పెడతారు? అందరూ అనుకునేది అబద్ధం.. దాని వెనుక సైన్స్ ఇదే

వడ మధ్యలో ఉండే రంధ్రం కేవలం అందం కోసం కాదు.. సమానంగా వేగి రుచిగా తయారయ్యేలా చేసే వంటశాస్త్ర రహస్యం అందులో దాగి ఉంది. వడ ఆకారం వెనుక ఉన్న ఆసక్తికరమైన సైన్స్ తెలుసుకుంటే ఇకపై ప్రతి వడను కొత్త కోణంలో చూస్తారు. దక్షిణ భారతీయ అల్పాహారాల్లో ఇడ్లీ, దోసె తర్వాత అత్యంత ప్రజాదరణ పొందిన వంటకం మినప వడ. వేడివేడిగా సాంబార్, కొబ్బరి చట్నీతో వడ్డించే వడను చిన్నా, పెద్దా అందరూ ఇష్టంగా తింటారు. అయితే వడను చూసిన ప్రతిసారి చాలామందికి ఒక సందేహం వస్తుంది. మధ్యలో రంధ్రం ఎందుకు పెడతారు? అది కేవలం అందం కోసమా? లేక దాని వెనుక ఏదైనా ప్రత్యేక కారణం ఉందా? వాస్తవానికి ఈ చిన్న రంధ్రం వెనుక ఆసక్తికరమైన వంటశాస్త్రం దాగి ఉందని నిపుణులు వైజాగ్‌లోని ఓ టిఫిన్ హోటల్ యజమాని సూరయ్య చెబుతున్నారు. వడను సాధారణంగా మినపప్పుతో తయారు చేస్తారు. ఈ పిండి చాలా దట్టంగా ఉంటుంది. అలాంటి పిండిని గుండ్రంగా చేసి రంధ్రం లేకుండా నూనెలో వేస్తే బయట భాగం త్వరగా వేగిపోతుంది. కానీ లోపలి భాగం పూర్తిగా ఉడకకపోయే అవకాశం ఉంటుంది. మధ్యలో రంధ్రం ఉండటం వల్ల వేడి నూనె అన్ని వైపులా సమానంగా చేరి వడ లోపల కూడా బాగా ఉడికేలా చేస్తుంది. దీంతో బయట కరకరలాడుతూ, లోపల మెత్తగా ఉండే సరైన టెక్స్చర్ వస్తుంది. అంతేకాదు, మధ్యలో రంధ్రం ఉండటం వల్ల వడ త్వరగా వేగుతుంది. వేగే సమయం తగ్గడంతో అదనపు నూనె పీల్చుకునే అవకాశం కూడా తగ్గుతుంది. ఫలితంగా వడ ఎక్కువగా జిడ్డుగా కాకుండా తేలికగా, రుచిగా ఉంటుంది. అందుకే మంచి హోటళ్లలో తయారయ్యే వడలు బయట క్రిస్పీగా,





లోపల మృదువుగా ఉంటాయి. వంట చేసే వారికి కూడా ఈ రంధ్రం ఎంతో ఉపయోగపడుతుంది. సంప్రదాయంగా చేతిపై పిండిని ఉంచి బొటనవేలితో మధ్యలో రంధ్రం చేసి నూనెలో వేస్తారు. ఇలా చేయడం వల్ల వడ ఆకారం చెడిపోకుండా ఉంటుంది. అలాగే నూనెలో వేస్తున్నప్పుడు, తర్వాత తిప్పేటప్పుడు, బయటకు తీసేటప్పుడు కూడా సులభంగా నిర్వహించవచ్చు. కాలక్రమేణా ఈ ఆకారమే వడకు ప్రత్యేక గుర్తింపుగా మారిపోయింది. రోడ్డు పక్కన టిఫిన్ బండి నుంచి స్టార్ హోటల్ వరకు ఎక్కడ చూసినా మధ్యలో రంధ్రం ఉన్న వడనే అందిస్తారు. ఈ రూపమే వడకు ప్రత్యేక ఐడెంటిటీని తీసుకొచ్చిందని ఆహార నిపుణులు చెబుతున్నారు. అయితే వడ మధ్యలో రంధ్రం పెట్టడం వల్ల ఆరోగ్యపరంగా ప్రత్యేక ప్రయోజనాలు లభిస్తాయని లేదా పోషక విలువలు పెరుగుతాయని చెప్పడానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఇది పూర్తిగా వంట సౌలభ్యం, సమానంగా వేగడం, సరైన టెక్స్చర్ రావడం కోసం తరతరాలుగా పాటిస్తున్న పద్ధతి మాత్రమే అని నిపుణులు వివరిస్తున్నారు. అంటే మనం ప్రతిరోజూ తినే సాధారణ మినప వడ వెనుక కూడా వంట అనుభవం, శాస్త్రీయ ఆలోచన, సంప్రదాయం కలిసి ఉన్నాయని చెప్పవచ్చు. ఇకపై వడ తింటున్నప్పుడు దాని మధ్యలో ఉన్న చిన్న రంధ్రం కేవలం ఆకారం కోసం కాదని, అది రుచికి, నాణ్యతకు కీలకమైన రహస్యమని గుర్తుంచుకోండి. అంటే మనం ప్రతిరోజూ తినే సాధారణ మినప వడ వెనుక కూడా వంట అనుభవం, శాస్త్రీయ ఆలోచన, సంప్రదాయం కలిసి ఉన్నాయని చెప్పవచ్చు. ఇకపై వడ తింటున్నప్పుడు దాని మధ్యలో ఉన్న చిన్న రంధ్రం కేవలం ఆకారం కోసం కాదని, అది రుచికి, నాణ్యతకు కీలకమైన రహస్యమని గుర్తుంచుకోండి.

# మతిమరుపు ఎక్కువైందా? రోజుకు 20 నిమిషాలు ఇలా చేస్తే చాలు.. మీ బ్రెయిన్ సూపర్‌ఫాస్ట్ అయిపోతుంది..

ప్రతిరోజూ పాటించే కొన్ని మంచి అలవాట్లు మెదడు పనితీరును మెరుగుపరచి జ్ఞాపకశక్తిని పెంచుతాయని నిపుణులు చెబుతున్నారు. తగినంత నీరు, నిద్ర, వ్యాయామం, సూర్యరశ్మి, ప్రశాంత సమయం వంటి అలవాట్లు మెదడు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి. మన రోజువారీ జీవితంలో పాటించే కొన్ని సాధారణ అలవాట్లు మెదడు పనితీరును మెరుగుపరచడంలో, జ్ఞాపకశక్తిని పెంచడంలో, మానసిక ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. మెదడును ఆరోగ్యంగా, చురుకుగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిన ఐదు ముఖ్యమైన అలవాట్లు ఇవే. మన రోజువారీ జీవితంలో పాటించే కొన్ని సాధారణ అలవాట్లు మెదడు పనితీరును మెరుగుపరచడంలో, జ్ఞాపకశక్తిని పెంచడంలో, మానసిక ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. మెదడును ఆరోగ్యంగా, చురుకుగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిన ఐదు ముఖ్యమైన అలవాట్లు ఇవే. తగినంత నీరు తాగండి: వైద్య నిపుణుల ప్రకారం మన మెదడులో దాదాపు 75 శాతం నీరే ఉంటుంది. అందువల్ల శరీరంలో స్వల్పంగా నీటి కొరత ఏర్పడినా కొద్ది గంటల్లోనే మెదడు పనితీరుపై ప్రభావం పడుతుంది. ఏకాగ్రత తగ్గడం, అలసట, తలనొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రతిరోజూ అవసరమైనంత నీరు తాగడం మెదడు ఆరోగ్యానికి ఎంతో అవసరం. రోజుకు 7–8 గంటలు నిద్ర తప్పనిసరి: మనం నిద్రిస్తున్న సమయంలో మెదడు తనను తాను శుభ్రం చేసుకుంటుంది. ముఖ్యంగా అల్జీమర్స్ వంటి వ్యాధులతో సంబంధం ఉన్న హానికర వ్యర్థాలను తొలగించడంలో నిద్ర కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచే నాడీ సంబంధాలను బలపరుస్తుంది. అందుకే రోజుకు కనీసం 7 నుంచి 8 గంటల నాణ్యమైన నిద్ర అవసరం. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి: రోజువారీ వ్యాయామం లేదా శారీరక శ్రమ వల్ల మెదడుకు అవసరమైన ఆక్సిజన్ సమృద్ధిగా అందుతుంది. అలాగే బ్రెయిన్ డెరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్ (దీఐచీఖీ) అనే ప్రోటీన్ ఉత్పత్తి పెరిగి మెదడులోని నాడీ కణాల మధ్య సంబంధాలు బలపడతాయి. దీని వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మానసిక స్థితి మెరుగుపడతాయి. ఉదయం కొంతసేపు సూర్యరశ్మిలో ఉండండి: ఉదయం సూర్యరశ్మి శరీరంలో సెరోటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఇది మనసును ఉల్లాసంగా



ఉంచడమే కాకుండా ఒత్తిడి, నిరాశ, ఆందోళన వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు సూర్యరశ్మిలో ఉండడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు 20 నిమిషాలు ప్రశాంతంగా గడపండి: ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు ప్రశాంతంగా ధ్యానం చేయడం లేదా నిశ్శబ్దంగా కూర్చోవడం వల్ల శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసోల్ హార్మోన్ స్థాయి తగ్గుతుంది. దీంతో మెదడు విశ్రాంతి పొందడంతో పాటు కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, స్వీయ అవగాహన పెరుగుతాయి. ఈ చిన్న అలవాట్లను ప్రతిరోజూ పాటించడం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మానసిక ప్రశాంతతను మెరుగుపరచుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు 20 నిమిషాలు ప్రశాంతంగా గడపండి: ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు ప్రశాంతంగా ధ్యానం చేయడం లేదా నిశ్శబ్దంగా కూర్చోవడం వల్ల శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసోల్ హార్మోన్ స్థాయి తగ్గుతుంది. దీంతో మెదడు విశ్రాంతి పొందడంతో పాటు కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, స్వీయ అవగాహన పెరుగుతాయి.



## ఉద్యమకారుల హామీల అమలుకు అల్వాల్‌లో మూడోరోజు రిలే నిరాహార దీక్షలు

**మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను వెంటనే అమలు చేయాలి: పట్లోళ్ల సురేందర్‌రెడ్డి**

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో అల్వాల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం మూడోరోజు కొనసాగాయి. అమరవీరుల దీక్షా శిబిరంలో ఉద్యమకారులు దీక్షలో పాల్గొని ప్రభుత్వ తీరుపై తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకుడు పట్లోళ్ల సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, ఇంటి స్థలాలు, 250 గజాల స్థలాల కేటాయింపు తదితర అంశాలను మేనిఫెస్టోలో పేర్కొన్నప్పటికీ వాటి అమలులో జాప్యం జరుగుతోందని అన్నారు. హామీల సాధన కోసం మలిదశ నిరాహార దీక్షలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. మల్లారి అనిల్ కుమార్, మోత్కూరు మల్లేష్, జానకి రెడ్డి, నాగేశ్వరరావు, నాగేష్, సతీష్ కుమార్, రమేష్ చారి, నరేష్ కుమార్, రాజేష్, వెంకటేష్ యాదవ్, ఎస్. మల్లేష్, నరేష్, అనిల్ రాజ్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## కారిడార్ నిర్మాణం నుంచి దేవాలయాలను పరిరక్షించాలి

అల్వాల్: కారిడార్ నిర్మాణ పనుల్లో భాగంగా లోతుకుంటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం, విజయగణపతి దేవాలయాలను పరిరక్షించాలని కోరుతూ స్థానిక ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఆలయాల స్థలాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ఆలయాలు ప్రజల విశ్వాసానికి, మనోభావాలకు ప్రతీకలని, కారిడార్ నిర్మాణ పనుల కారణంగా వాటి స్థలాలను ఆక్రమించే పరిస్థితి ఏర్పడితే ప్రజల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆలయ స్థలాలకు నష్టం కలిగించాల్సి వస్తే, ప్రత్యామ్నాయంగా ప్రత్యేక స్థలాన్ని కేటాయించి ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆలయాల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శ్రీశైలం, శేఖర్, సంజయ్ గౌడ్, రాజేష్ గౌడ్, అనిల్ కుమార్ తో పాటు లోతుకుంటకు చెందిన యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



### తెలంగాణ జన సమితి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

## నూతన కమిటీ ఏర్పాటు

మేడ్చల్–మల్కాజిగిరి: తెలంగాణ జన సమితి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నూతన కమిటీని నియమించారు. తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం నూతన కమిటీకి నియామక పత్రాలను అందజేశారు. నూతన జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మారం లక్ష్మారెడ్డి నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా రెడ్డిపల్లి శ్రీనివాస్, తిరుమల్ రెడ్డి, బర్మోజు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శిగా ఏర్పుల దయాకర్, కోశాధికారిగా సుమంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జంగం రవికుమార్, లింగోల దయాకర్ గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా గాండ్ల లక్ష్మణ్, పాలమోని బాల శివశంకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు అశోక్ రెడ్డి, భద్రకామి ఆంజనేయులు, రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ఎర్ర వీరన్న తో పాటు నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ పల్లె వినయ్ కుమార్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి పార్టీని జిల్లాలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.



# సిగ్మా ట్రైలర్ రిలీజ్

సందీప్ కిషన్ యాక్షన్-అడ్వెంచర్, హీస్ట్ కామెడీ ఎంటర్టైనర్ 'సిగ్మా' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రతిష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రంపై ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్ సినిమాకు సంబంధించిన డిఫరెంట్ వరల్డ్‌ను, యాక్షన్ టచ్‌ను పరిచయం చేశాయి. కోస్తాంధ్ర, తెలంగాణలో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండగా, సీడెడ్ ప్రాంతంలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తుంది. తాజాగా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. మోసపోయిన హీరో, జరిగిన దాన్ని మర్చిపోయి ముందుకు వెళ్లకుండా.. తనకు జరిగిన నష్టాన్ని తిరిగి సాధించుకోవాలని పోరాటం మొదలుపెడతాడు. డ్రగ్స్, గ్యాంబ్లింగ్‌కు సంబంధించిన రూ.500 కోట్ల భారీ రాకెట్ ఈ కథలో కీలకంగా ఉంటుంది. దీంతో హీరో క్రైమ్, మోసం, ప్రమాదాలతో కూడిన ప్రపంచంలోకి అడుగుపెడతాడు. సందీప్ కిషన్ తనదైన స్వాగ్‌తో క్యారెక్టర్‌లో ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఆయనకు జోడీగా ఫారియా అబ్దుల్లా కీలక పాత్రలో కనిపించారు. వీరిద్దరి కెమిస్ట్రీ బాగుంది. రాజు సుందరం తన కామెడీతో ఫ్రెష్‌నెస్ తీసుకురాగా.. సంపత్ రాజ్ రెడ్డి పాత్రలో పవర్‌ఫుల్ ఇంపాక్ట్ చూపించారు.



# ఈ నెల 25న రిలీజ్

# కళ్యాణం కమనీయం జీవితం

వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరో హీరో యిన్స్‌గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "కళ్యాణం కమనీయం జీవితం". ఈ సినిమా ఈ నెల 25న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అయ్యింది. మీడియా సమావేశం నిర్వహించారు నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ; రీసెంట్ గా మా కళ్యాణం కమనీయం జీవితం సినిమా ని మా ఫ్రెండ్స్ కి , శ్రేయోభిలాషుల కు కొంతమంది మీడియా మిత్రులకు చూపి ంచడం జరిగింది. సినిమాని చూసిన తర్వాత సినిమా చాలా బాగుంది అని మెచ్చుకున్నారు. మంచి వ్యక్తులతో ఈ సినిమా ప్రారంభమైంది. లెజెండరీ రైటర్ విజయేంద్రప్రసాద్ గారు సినిమా పోస్టర్ ను, చంద్రబోస్ గారు పాటను విడుదల చేశారు వి వి వినాయక్ గారు కూడా మా ఈవెంట్ కు వచ్చి మమ్మల్ని ఆశీర్వదించారు. ఈ మూవీ మంచి ఫ్యామిలీ, యూత్ ఓరియంటెడ్ మూవీ గా మా డైరెక్టర్ తీర్చిదిద్దారు. ఈ మూవీలో నటించిన నటి నటులు ది బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ఇచ్చారు. శ్రీ మురళి కార్తికేయ మంచి పాటలను, సంగీ తాన్ని అందించారు. ఈ నెల 25 న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాము. మూవీ చిన్నదైనా కంటెంట్ చాలా పెద్దది. డైరెక్టర్ రవి లోకిరెడ్డి, రైటర్ అరవింద్ ఏకలవ్య మంచి గా సినిమాని తీర్చిదిద్దారు. ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మకం ఉంది అని అన్నారు డైరెక్టర్ రవి లోకిరెడ్డి మాట్లాడుతూ: టైటిల్ విని మా నిర్మాతలు ఈ సినిమా ని ఒకే చేశారు. ఇందులో సాంగ్స్, ట్రైలర్ కు మంచిరెస్పాన్స్ వచ్చింది. మేమందరం చాలా కష్టపడి ఈ సినిమాని తీర్చిదిద్దాము. మంచి పాటలు ఉంటాయి మంచి కథ వుంటుంది మంచి ఎమోషన్ వుంటుంది. నటి నటులు కొత్త వారైనా చాలా బాగా నటించారు. సత్యానంద్ గారు కూడా నటించారు ఆయన ఎంతోమంది నటీనటులకు నటనలో శిక్షణ ఇచ్చారు. సినిమాకొచ్చిన ఆడియెన్స్ డిసప్పాయింట్ అవ్వరు. 100 రూపాయలు పెట్టి టికెట్ కొంటే దానికి డబల్ మీరు ఎంజే చేస్తారు చాలా ట్విస్టులు ఉంటాయి. ఈనెల 25 న ఆంధ్ర తెలంగాణ లో సినిమా రిలీజ్ అవుతుంది అన్నారు.

# మంచి లాభాలు తీసుకొచ్చే

# 'ప్రేమనే ఊరిలో'



మహారత్న ప్రొడక్షన్స్, ఎస్‌కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమనే ఊరిలో'. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివ, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు విడుదల చేసిన పాటలు, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. మరో పాటను రిలీజ్ చేశారు. చందు శ్రీనివాస్ మాట్లాడుతూ .. "ప్రేమనే ఊరిలో' సినిమాతో నిర్మాతగా అడుగు పెడుతున్నాను. చిన్నతనం నుంచీ సినిమాలంటే ఇష్టం. ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలు పెట్టి ఇప్పుడు ఈ స్థాయికి చేరుకున్నాను. దేవేందర్ గారు నాకు బిజినెస్‌లో హెల్ప్ చేశారు. ఆయన వల్లే ఈ సినిమా నాకు తెలిసింది. పోస్టర్ చూసిన వెంటనే నాకు ఎంతో నచ్చింది. జెన్ జీ ఆడియెన్స్‌ని కూడా మూవీని చూపించాం. అన్ని వర్గాల ఆడియెన్స్‌కి సినిమా చాలా నచ్చింది. రాంబాబు మాకు మంచి సాహిత్యాన్ని ఇచ్చారు. శ్రీరామ్, రమిక, తపస్విని అద్భుతంగా నటించారు. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నాను' అని అన్నారు. సురేష్ కొండేటి మాట్లాడుతూ .. 'నేను గతంలో చేసిన 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్ మాల్' రేంజ్‌లో 'ప్రేమనే ఊరిలో' ఉంటుంది. ఈ ఇండస్ట్రీకి దూరంగా ఉండమని చందుకి సలహా ఇస్తుంటాను. అయితే ఈ మూవీ గురించి చెప్పినప్పుడు, చూసినప్పుడు నా నిర్ణయం మార్చుకున్నాను. మనం కలిసి ఇకపై జర్నీ స్టార్ట్ చేద్దాం అని చందుతో అన్నాను. 'ప్రేమనే ఊరిలో' కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది. శ్రీరామ్, రమిక, తపస్వినిలకు ఈ చిత్రంతో మంచి పేరు వస్తుంది. కన్నడ, తెలుగులో ఈ సినిమాకి మంచి విజయం దక్కుతుంది. సెప్టెంబర్ 25న ఈ చిత్రం రిలీజ్ కాబోతోంది. రూపాయి పెడితే ఐదు రూపాయల లాభం తీసుకు వచ్చే సినిమా అవుతుంది అన్నారు.






CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY, # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printed at: GARUDA PRINT-ERS, # H.No.2-86/1, Plot No.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510. Telangana. Published at: # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District. 501511. Telangana....www.arunaprabha.com.email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889.